57347

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 7, 2008

కథా నిలయం
శ్రీకాకుళం



ఉగ్రవాదం

దీనికి తన, మన లేవు

హ్యాపీబర్త్‌డే

(2008 డిసెంబర్-7 నుంచి
2008 డిసెంబర్-13 వరకు)

ఐల
5సం॥, డిసెంబర్-2003
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

కె. సందీప్
4సం॥, డిసెంబర్-2004
మాధవి-బసవయ్య
పల్లాయిపల్లి-నల్లగొండ

కె. దీక్షిత
3సం॥, డిసెంబర్-8
ఇందిర-సుధీర్
తాటిపాముల-నల్లగొండ

జోగేంద్రప్రసాద్
4సం॥, డిసెంబర్-7
లక్ష్మీవందన-శ్రీనివాసరావు
హైయతినగరం-శ్రీకాకుళం

ఎం. ప్రణయ్
5సం॥, డిసెంబర్-9
సుచరిత-నాగేష్
నల్లగొండ

బి. ఉత్తేజ్
7సం॥, డిసెంబర్-2001
విజయ-సోమన్న
తాటిపాముల-నల్లగొండ

కె. సత్యలోకేష్
డిసెంబర్
కనకదుర్గ-రంగనాయకులు
మధురానగర్-విశాఖపట్నం

జి. శ్రీవైష్ణవి
5సం॥, డిసెంబర్-12
ప్రసన్న-శేఖర్‌రెడ్డి
మహబూబ్‌నగర్

ఎం.డి. సోహేల్
5సం॥, డిసెంబర్-8
షబానా-అక్బర్
దోమల్‌గూడ-హైదరాబాద్

చరణ్‌తేజ
1సం॥, డిసెంబర్-2007
నాగమణి-నర్సింహ
నల్లగొండ

డి. పండు
1సం॥, డిసెంబర్-2007
సంతోష-గణేష్
పెద్దతూండ్ల-రంగారెడ్డి

వై. జ్ఞానతేజ
1సం॥, డిసెంబర్-13
సుష్మ-నాగమహేష్
విజయవాడ-కృష్ణా

రఫాత్అఫ్రీన్
డిసెంబర్
రుహిఅఫ్రీన్-చాంద్‌బాషా
నెల్లూరు

ఎ. యామిని
డిసెంబర్
సుజన-శ్రీనివాసులు
వనంతోపు-నెల్లూరు

ఎస్. సునంద
డిసెంబర్-10
భాగ్య-ఓదేష్
గొల్లచర్ల-వరంగల్

మనలో మాట



గిలిగింతల చలి

చలి... ఆకారం లేని మహా బలశాలి. అనేక వ్యవహారాలు చక్కబెట్టగల ధీశాలి. వయసుకొక తీరున అనిపించే గొప్ప గడసరి! మనసున మధురోహలు మొలిపించే తెంపరి.. చల్లచల్లని వాతావరణంలోకి నులివెచ్చని హాయిదనం- మెల్లమెల్లగా చొచ్చుకురావటం గమ్మత్తుగా ఉంటుంది. ఉల్లిపొరల మంచుతెరల మధ్య ఉషోదయం గొప్ప దృశ్యకావ్యంలా కనిపిస్తుంది.

అందుకనే, చలికాలపు గిలిగింతకు కవులు పరవశించిపోతారు. భళిభళి చలియని బహుదానందపడిపోతారు. చలిలేని చోటు, చెలి లేని లోటు తీరని బాధ కలిగిస్తాయని జ్ఞానబోధ చేశాడు గాలిబ్. ఈ కవివాక్కును కచ్చితంగా పాటిస్తారు సినిమావాళ్లు. చలిచలిగా ఉండే పాటలూ, సన్నివేశాలూ తెరనిండుగా వండి వడ్డిస్తారు. ప్రేక్షకులకు చలిగింతలు పెడితేనే కావల్సినన్ని కాసులు రాలతాయనేది వారి సిద్ధాంతం. చలికి ఉన్న డిమాండు అంతా ఇంతా కాదు. చలికేంద్రాలు కావడంవల్లే అటు కాశ్మీరం, ఇటు ఉదకమండలం నిత్యం సందర్శకులతో కిటకిటలాడతాయి. ఈ విధంగా జాతి సర్వతోభివృద్ధిలో చలి చక్కని పాత్ర పోషిస్తోంది!

చలి ముదిరి ముదిరి అదరగొడితే- మునగదీసుకొని కూచోవల్సిందే! గాలి పదునైన సూదిలాగా, చురుక్కుమనే చురకలాగా స్ఫురించటం అలాంటప్పుడే అనుభవంలోకి వస్తుంది. బాలభానుడు క్రమక్రమంగా పరాక్రమిస్తే.. చలి వాడివేడిగా పలాయిస్తుంది. అది పెరుక్కుంటూ పోతే చల్లగాలి స్థానే ఉక్కపోత మొదలవుతోంది. దీనినుంచే మనకు "మితి'మించనిది సౌఖ్యం.. 'అతి' అయినది నరకం' అన్న జీవిత సత్యం సుబోధకమవుతుంది. విలాసజీవులకు చలి ఒక సరికొత్త అనుభవం. కానీ, సరైన గూడు లేని కోట్లాది పేదలకు కష్టాలమయం! మన రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల పిల్లలకు చలికాలం నరకప్రాయం! 'నిద్ర'(కు) పోయే పాలకులకు ఈ నిజం తెలియంది కాదు. వెచ్చగా బజ్జొనేవాళ్లకు కళ్లు తెరవడం ఇష్టం ఉండదు, అంతే..!

చలి వెనక పులి అనే బిరుదు తోకలా వెన్నంటి ఉంటుంది. పులిపంజా కన్నా చలిపంజా ప్రమాదకరం. చలి భయంవల్లే హిమరాశులు ఇంతెత్తున పేరుకున్న హిమాలయాలను ఎవరూ కబ్జా చేయరు. భూగోళం మొత్తం మనిషి మహాక్రమణతో ఇరుక్కుపోయింది. కానీ, ధృవ ప్రాంతాల్లో ఇలాంటి దురాక్రమణ జరగదు. చలిపులికి భయపడే మానవమాత్రులు అటువైపు తొంగిచూడరు. అందుకనే- చలి పులి కన్నా చాలా పవర్‌ఫుల్లని ఒప్పుకోవాలి.

మరి ఇంతటి చలీ మనల్ని ఎందుకు వణికించలేకపోతోంది?

బహుశా, రాష్ట్రంలో రాజుకున్న రాజకీయ వేడి వల్ల కావొచ్చు. నేతల మాటల్లోంచి నిప్పులూ తూటాలూ నిర్విరామంగా దూసుకురావడంవల్ల కావొచ్చు. అందుకనే చలి నెమ్మనెమ్మదిగా ఎక్కడికో వెళ్లిపోతోంది! బహుశా, గెలిచి తీరుతామంటున్న నాయకుల వెన్నులోకి కాబోలు!! ✠

ఈ సంచికలో....

టపా	...	2
లాహిరిలో	...	3
కథ	...	6
కవిత్వమ్	...	8
ఆరోగ్యం	...	9
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
సమ్‌థింగ్ స్పెషల్	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

సినిమా ... 4

సుస్మితాసేన్ మాదిరి కళ్లు చెమ్మగిల్లాయి.

మంచి పుస్తకం ... 10

విజయపథం

విష వలయం

తెలుసుకుందామా ... 18

బ్లాక్ కాట్ కమాండోలు



చూద్దామా ... 20

నయాగరా



ఆదర్శ గ్రంథం

అట్టమీది కథ కేవలం సమాచారం కాదు. ప్రపంచ సామాజిక చరిత్రకు కోట్లాది ప్రజల జీవన విధానానికి, పీడిత తాడిత విమోచనకు, సామాజిక మార్పుకు, వర్గ సమాజ మార్పుకు, దోపిడి లేని సమాజ నిర్మాణం కొరకు కావలసిన సైద్ధాంతిక గ్రంథమే ఈ దాస్ కాపిటల్ పుస్తకం. ఉద్యమ కారులకు దాస్ కాపిటల్ ఆదర్శం.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక.

చూద్దామా బావుంది

23-11-08 స్నేహలో ఒక జాబిలి కోసం అంటూ అందని చందమామ కోసం మనిషి ఈనాడు పరితపిస్తున్నాడని, చూడడానికి చెప్పడానికి అందంగా ఉన్నా అందని పథకాలతో కాంగ్రెస్ నేతలు ఆటాడుతున్నారని మరోసారి గుర్తుచేశారు.ఇది చదివిన ప్రతి పాఠకుడు తెల్సుకోవాల్సిన సత్యం ఇది. ఆరోగ్యంలో టాన్సిల్స్... వ్యాధికాదు అనే శీర్షికలో గొంతుకు వచ్చే ప్రతి సమస్యను టాన్సిల్స్‌గానే భావించకూడదని అర్థమైంది. టాన్సిల్స్ గురించిన అపోహలు వీడాలని డాక్టర్ సుస్మిత గారు చాలా చక్కగా వివరించారు. చూద్దామాలో ఏడు వింతల్లో గ్రాండ్ కనియన్ లోయ ఒకటంటూ వసంత కుమారి గారు వివరించటం బాగుంది. కాపిటల్ కవర్ స్టోరీ చదివిన తర్వాత నాటి జర్మన్ ప్రభువుల మెప్పు పొందేందుకు, తోటివారిలా కవిత్వం రాసేందుకు, కావ్యాలు అల్లేందుకే కారల్ మార్క్స్ పరిమితం అయి ఉంటే ప్రపంచ గతినే మార్చేసిన శాస్త్రీయ సోషలిజం, కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఎవరు రూపొందించి ఉండేవారనిపించింది. కారల్ మార్క్స్ గ్రంథం గురించి వివరిస్తూ ప్రియ మిత్రుడు ఫెడరిక్ ఏంగెల్స్ గురించి చెప్పకపోతే అది మానవ కళ్యాణానికి తోడ్పడిన మిత్రుని చిన్న చూపు చూడడమే అవుతుందని ఆయన చెప్పిన నిజాలను చక్కగా వివరించారు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు.

సామాజిక స్పృహ వున్న కవితలు

అట్టమీది కథ కాపిటల్ అంశంతో ఆసక్తికరంగా సాగింది. సినిమా కబుర్లు ద్వారా విజయచందర్‌గారి మనోభావాలు తెలుసుకునేందుకు అవకాశం కలిగింది. త్వరలో ఆయన్ని రామకృష్ణ పరమహంసగా, అంబేద్కర్‌గా చూడబోతుండడం హర్షణీయాంశం. తన మొహాన్నే కాన్వాస్‌గా మార్చుకున్న జేమ్స్ కున్‌కు అభినందనలు. లాహిరి లాహిరిలో బి.ఎన్ రెడ్డి గారి విశేషాలు చదివి ఆనందించాం. బాలనేస్తాలులో నీడ బొమ్మల చిత్రాలు మా మనసును దోచాయి. కవిత్వమ్ కాలమ్‌లో సామాజిక స్పృహ పుష్కలంగా ఉన్న కవితలు ప్రచురితమవడం అభినందనీయం. ఒక జాబిలికోసం... స్కెచ్ వ్యంగ్యంగా, వర్ధమాన చరిత్రలోని సంఘటనలను మా ముందుంచటం ఎంతో ముదావహం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
శ్రీకాకుళం.

ఆరోగ్య అంశాలు తెలిశాయి

పెట్టుబడిదారుల ఆధిపత్యం వల్ల వర్గపోరాటాలు ఏర్పడడంతో పాటు కార్మికులు, కర్షకులు దోపిడీకి గురవుతున్న పరిస్థితులను గురించి మార్క్స్ రచించిన దాస్ కాపిటల్ పైన ఆసక్తికర విషయాలను 23-11-08 నాటి స్నేహలో చదివి తెలుసుకున్నాం. తాను రాసిన కాపిటల్ వల్ల దోపిడీదారుల ఆగ్రహానికి గురయినా వెరవక భావితరాల వారు ఆర్థిక సంక్షోభం నుండి ఎలా తప్పించుకోవాలో వివరించిన కారల్ మార్క్స్ ఎంతో గొప్ప వ్యక్తి అనడం నిజంగా సమంజసం. అలాగే పిల్లలకు ఎక్కువగా వచ్చే టాన్సిల్స్‌ను గురించిన జాగ్రత్తలతో కూడిన విషయాలను ఆరోగ్యం శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. కరుణామయుడు చిత్రం ద్వారా తెలుగు సినీ పరిశ్రమలో తన ప్రత్యేకతను నిల్పుకొన్న విజయ చందర్ గారి అనుభవాలను సినిమా కబుర్లు ద్వారా అందించినందుకు అభినందనలు. గ్రాండ్ కనియన్ విశిష్టత గురించి తెలియచేసినందుకు ధన్యవాదాలు.

గొల్లమందల సురేష్ కుమార్, సీతారాం పురం, ఖమ్మం.

ఏసు అంటే విజయచందరే

23-11-08 ఆదివారం అనుబంధం స్నేహలో ఆరోగ్యం ద్వారా టాన్సిలైటిస్, గొంతునొప్పితో బాధపడుతూ ఆహారం తినలేక, నీళ్లు కూడా తాగలేక బాధపడుతున్నారు. పట్టణాలలో విచ్చలవిడిగా పొగాకు నములుతున్నారు. ఇలాంటి వాళ్లు నూటికి తొంభైమంది గొంతు నొప్పితో జ్వరాలతో కేన్సర్ వచ్చి బిక్కు బిక్కుమంటూ బాధపడుతూ బతుకుతున్నారు. ముఖ్యంగా పిల్లల గురించి తల్లిదండ్రులు జాగ్రత్తగా



చూసుకోవాలి. ఈవిషయాలన్నీ చెప్పిన డా॥సుస్మిత గారికి ధన్యవాదాలు. చూద్దామాలో గ్రాండ్ కనియన్‌లో హూవర్‌డామ్ గురించి చదివిన తర్వాత ఆశ్చర్యం కలిగింది. సినిమా కబుర్లులో కరుణామయుడు, ఏసుక్రీస్తు, సాయిబాబాగా ప్రేక్షకుల హృదయాల్లో దైవంగా నిలిచిన రామ్ చందర్ (విజయ చందర్) గార్కి అభినందనలు. అప్పట్లో ఏసు అంటే ఇలాగే ఉంటాడు అని అనుకొనేవాళ్లం. మేము ఇప్పటికీ మరిచిపోలేని మరో ప్రపంచం సినిమా మాకు తీపి గుర్తు. ఇంకా ఇలాంటి సినిమాలు ఆయన చేయాలని కోరుకుంటున్నాము. ఈవారం అట్టమీది కథగా కార్మిక సంఘాలు, ఉద్యమాలకోసం ఎంతో త్యాగం చేసిన కారల్ మార్క్స్ గురించి చదివేకొద్దీ చదవాలనిపిస్తోంది. కాపిటల్ చాలా బాగుంది. ఈ శీర్షిక అందించిన ఎం. కోటేశ్వరరావు గారికి కంగ్రాట్స్.

అనుపోజు సంతోషి
నాగరాజు,విజయనగరం.

వీరి వీరి గుమ్మడి పండు

వీరి పేరేమి?

ఈ ఫోటో ఓ ప్రముఖ నటిది. ఎవరో తెలియాలంటే 23 వ పేజీ చూడండి.

గాన గంధర్వుడు ఘంటసాల

ఘంటసాల పాడిన సినిమా పాటలు ఒక ఎత్తైతే ఆయన పాడిన ప్రైవేటు పాటలు మరో ఎత్తు. ముఖ్యంగా ఘంటసాల పాడిన భగవద్గీత తెలుగువారి ఇళ్లలో, పూజల్లో, దేవాలయాల్లో మారు మోగుతూనే ఉంది. అలాగే కరుణశ్రీ 'పుష్పవిలాపాన్ని' ఆయన పాడడం వల్లే బహుళ ప్రచారంలోకి వచ్చింది. వేంకటేశ్వరునికి సంబంధించిన పాటలు నేటికీ తిరుమల గిరుల్లో మారు మోగుతూనే ఉన్నాయి.

- ప్రొ॥ పేట శ్రీ

తేనెలొలుకు తియ్యని తెలుగును చెవులకు అమృతంలా పాడి వినిపించిన ఘంటసాల పూర్తి పేరు ఘంటసాల వెంకటేశ్వరరావు. ఈయన గాన గంధర్వుడు. ఆయన పాడిన పాటలు నేటికీ ఆంధ్రదేశం నలుమూలలా మారుమోగుతూనే ఉన్నాయి. చెవులూరించే ఈయన పాటలు ఎన్నిసార్లు విన్నా తనివి తీరదు. తెలుగుజాతి గర్వించదగ్గ గానకోకిల మన ఘంటసాల. ఈయన పాటలు పాడినా, పద్యాలు చెప్పినా, భగవద్గీత గానం చేసినా, భాషలో, యాసలో ఒక్క అక్షరం ముక్కైనా తప్పు వుండదు. ఎంతో భావయుక్తంగా పాడి మనసులపై చెరగని ముద్రవేశాడు. తెలుగు చలన చిత్రసీమలో ఇప్పటికీ ఘంటసాల పాడిన పాటలు హిట్టులుగా నిలిచిపోయాయి.

ఘంటసాల వెంకటేశ్వరరావు డిసెంబర్ 4, 1922లో కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, చౌటుపల్లిలో జన్మించారు. తండ్రి సూరయ్య అర్చక వృత్తి చేసుకొంటూ పాడిన పాటలే ఘంటసాలకు స్పూర్తినిచ్చాయి. మొదట 'సిద్దాంతం' అనే గ్రామానికి సంగీత పోటీలకెళ్లి నవ్వులపాలయ్యారు. తర్వాత అకుంఠిత దీక్షతో విజయనగరం వెళ్లి అక్కడ సంగీత కళాశాలలో శిక్షణ పొందారు. తర్వాత బతుకుదెరువును వెదుక్కొంటూ 1944 మేలో మద్రాసు చేరుకున్నారు. ఆయన పాటలు పాడడానికి ఎక్కడికి వెళ్లినా చుక్కెదురైంది. హిస్ మాస్టర్ వాయిస్ (హెచ్.ఎం.వి) కంపెనీ వారు ఘంటసాల గొంతును విని, మైకుకు పనికిరాదని తేల్చేశారు. అయినా ఘంటసాల నిరుత్సాహపడకుండా, అవకాశాల కోసం ఎదురుచూశారు. ఆ సమయంలో ఊరుకాని ఊరిలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతూ, ఒంటి పూట తిండి తింటూ, కట్లదొడ్డిలో పెట్టె పెట్టుకొని, పానగల్ పార్కులో పడుకునే వారు.

ఘంటసాల అవస్థను చూసి బాలాంత్రపు రజనీకాంతరావు సెప్టెంబర్ 30, 1944లో రేడియోలో పాడడానికి అవకాశం కల్పించారు. అలా ఘంటసాల మొట్టమొదట రేడియో ద్వారా ప్రజలకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత అక్కినేని నాగేశ్వరరావుతో పరిచయం అయ్యింది. ఇద్దరూ కలిసి ప్రతిభావారి ఫిలిం ఆఫీసుకు మకాం మార్చారు. అక్కడే పేకేటి శివరాంతో కూడా పరిచయం అయ్యింది. ఈ సమయంలో పేకేటికి హెచ్.ఎం.వి.వారి కంపెనీలో ఆర్కెస్ట్రా ఇన్‌ఛార్జిగా ఉద్యోగం వచ్చింది. అప్పుడే హెచ్.ఎం.వి. వారిని ఒప్పించి ఘంటసాల పాటలను రికార్డు చేశారు. ఆయన పాడిన తొలిపద్యం 'నగు మోమునకు', తొలిపాట 'గాలిలో నా బతుకు తేలిపోయినదోయ్' బహుళ ఆదరణ పొందాయి. అదే ఘంటసాల తొలి గ్రామ్‌ఫోన్ రికార్డు.

ఘంటసాల మొట్టమొదట 'స్వర్గసీమ' చిత్రంలో చిత్తూరు నాగయ్య సంగీత దర్శకత్వంలో భానుమతితో కలిసి యుగళ గీతాన్ని ఆలపించారు. సినీ గాయకుడిగా కొత్త జీవితాన్ని ప్రారంభించారు. తన సినీ జీవితంలో పదివేల పాటలను పాడి తెలుగువారి హృదయాలను సంగీత డోలికల్లో ఓలలాడించారు.

ఘంటసాల గాయకుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించాక, 'లక్ష్మమ్మ' సినిమాతో సంగీత దర్శకత్వ బాధ్యతలను కూడా స్వీకరించారు. 'జయం మనదే, మాయాబజార్, పాండవ వనవాసం' వంటి ఎన్నో చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించి తెలుగువారి గుండెల్లో కలకాలం నిలిచిపోయారు.

'దేవదాసు, పాతాళభైరవి, జయభేరి, భక్త జయదేవ, మల్లీశ్వరి, పాండురంగ మహత్యం, దేవత, మూగమనసులు, రక్త సంబంధం, జగదేకవీరుని కథ, మరలీకృష్ణ, అమరశిల్పి జక్కన్న, జయసింహ, దసరా బుల్లోడు, ప్రేమనగర్, అప్పుచేసి పప్పుకూడు, లవకుశ, డాక్టర్ చక్రవర్తి, గులేబకావలి కథ, గుండమ్మ కథ, శాంతినివాసం'...... ఇలా చెప్పుకుంటూ పోతే ఘంటసాల పాడిన ఎన్నో మరపురాని మధురమైన చిత్రాలను పేర్కొనాల్సి ఉంటుంది.

ఘంటసాల పాడిన సినిమా పాటలు ఒక ఎత్తైతే ఆయన పాడిన ప్రైవేటు పాటలు మరో ఎత్తు. ముఖ్యంగా ఘంటసాల పాడిన భగవద్గీత తెలుగువారి ఇళ్లలో, పూజల్లో, దేవాలయాల్లో మారు మోగుతూనే ఉంది. అలాగే కరుణశ్రీ 'పుష్పవిలాపాన్ని' ఆయన పాడడం వల్లే బహుళ ప్రచారంలోకి వచ్చింది. వేంకటేశ్వరునికి సంబంధించిన పాటలు నేటికీ తిరుమల గిరుల్లో మారు మోగుతూనే ఉన్నాయి.

ఉదా : - " శేష శైలవాసా - శ్రీ వెంకటేశ
శయనించు మా అయ్య శ్రీ చిద్విలాస"
" నమో వెంకటేశా... నమో తిరుమలేశా
నమస్తే... నమస్తే... నమః ఆ....
నమో వెంకటేశా... నమో తిరుమలేశా...
మహానందమాయే ఓ మహాదేవదేవ"

జయదేవుని అష్టపదుల్ని కూడా తెలుగువారికి అర్థమయ్యేరీతిలోగానం చేసి ఆనంద పారవశ్యాన్ని కలగజేశారు. 1969లో తిరుమల తిరపతి దేవస్థానం ఆస్థాన గాయకుడిగా ఘంటసాల నియమితులయ్యారు. ఇది ఘంటసాలకు తిరుమల శ్రీవారు ఇచ్చిన సత్కారంగా, పూర్వజన్మ సుకృతంగా భావించారు. 1970లో పద్మశ్రీ పురస్కారాన్ని ఘంటసాలకు భారత ప్రభుత్వం బహూకరించి, సత్కరించింది. 1971లో ఈయన ఐక్యరాజ్య సమితిలో గాన కచేరి చేసి, తెలుగువారి గౌరవాన్ని ఇనుమడింపజేశారు. ఘంటసాల అమర గాయకుడే కాదు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు కూడా. ఈయన 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలల పాటు జైలు శిక్షను అనుభవించాడు. అంతటి అరుదైన గాన గంధర్వుడు ఘంటసాల ఫిబ్రవరి 11, 1974లో మరణించారు. భారత తపాలా శాఖ 2003లో ఆయన జ్ఞాపకార్థం స్టాంపు విడుదల చేసింది.

సినిమా కబుర్లు

సుస్మితాసేన్ మాదిరి కళ్లు చెమ్మగిల్లాయి

- చందు

ఇంటర్వ్యూ పూర్తయింది. 'వినాయకుడు' టీ ఆఫర్ చేశాడు. అదేనండి 'వినాయకుడు' సినిమా పాత్రధారి కృష్ణుడు. ఛాయ్ హోటల్ ఓ ఫర్లాంగు దూరంలో ఉంది. నడుచుకుంటూ బయలుదేరాం. ఈలోగా పొరుగింట్లో నివాసముంటున్న ఓ పెద్దాయన వినాయకుణ్ణి 'బాబూ' అని పిలిచి 'సినిమా చూశాను. బాగుంది. బాగా చేశావు' అంటూ అభినందించారు. రోడ్డు మీద వెళ్తుంటే... ఇద్దరు వ్యక్తులు విష్ చేసి సినిమా బాగుందంటూ ప్రశంసించారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన పదేళ్లకు బ్రేక్ అందుకుని 'హ్యాపీడేస్'లోకి అడుగుపెట్టిన అల్లూరి కృష్ణంరాజు అలియాస్ కృష్ణుడు ఉరఫ్ వినాయకుడితో ముచ్చట్లు...

అలనాటి 'వినాయకుడు'

మీ గురించి చెబుతారా?

మాది తూర్పుగోదావరి జిల్లా రాజోలు దగ్గర చింతలపల్లి అనే కుగ్రామం. 1976 జులై 15న పుట్టాను. నా అసలు పేరు అల్లూరి కృష్ణంరాజు. సినిమా పేరు కృష్ణుడు. ఫ్రెండ్స్ అందరూ కృష్ణుడు అని పిలుస్తారు. దీంతో స్క్రీన్ నేమ్‌గా 'కృష్ణుడు' అని నేనే పెట్టుకున్నా.

చిత్ర పరిశ్రమతో సంబంధాలున్న ఫ్యామిలీ నుంచి వచ్చారా?

మాది బేసికల్‌గా పొలిటికల్ ఫ్యామిలీ. మా పెదనాన్నగారు ఎ.వి. సూర్యనారాయణరాజుగారు 20 సంవత్సరాలుగా తెలుగుదేశం ఎమ్మెల్యేగా ఉన్నారు. అలాగే మాజీ డిప్యూటీ స్పీకర్ కూడా. పెనుమత్స సాంబశివరాజు మా తాతగారు. ఆయన 46 ఏళ్ళుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉంటున్నారు. కానీ నేను మాత్రం రాజకీయాలకు దూరం. చిన్నప్పటి నుంచీ సినిమాలే లోకం. హాస్టల్లో చదువుకున్నాను. సెలవుల్లో ఇంటికొచ్చినప్పుడు ప్రతి రోజు 11 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళి సెకెండ్ షో సినిమాకి వెళ్ళేవాణ్ణి. తొమ్మిదో తరగతి వరకూ రాజోలు, నిడదవోలు, కాకినాడలో టెన్త్ క్లాస్ చదివాను. బెంగుళూరులో పాలిటెక్నిక్ డిప్లమో (ఆటోమొబైల్ టెక్నాలజీ) చేశాను. సినిమాల మీద ఇంట్రెస్ట్‌తో హీరో అవుదామని డిప్లమాతో చదువు ఆపేసి హైదరాబాద్ వచ్చాను. దేవదాస్ కనకాల దగ్గర యాక్టింగ్ కోర్సు చేశాను. దర్శకుడు శ్రీను వైట్ల, నేనూ రూంమేట్స్. అందరిలాగే వేషాల కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఓ రోజు నాకు అనుకోకుండా మేజర్ యాక్సిడెంట్ అయింది. మద్రాసులో ఆపరేషన్ చేశారు. సంవత్సరంపైగా బెడ్‌రెస్ట్ తీసుకొమ్మన్నారు. ఇక మా ఊరెళ్ళిపోయి అక్కడే ఉండిపోయాను. ఈక్రమంలో బాడీకి ఎక్సర్‌సైజ్ లేకపోవడం... ఇంట్లో ఉంటూ ఇష్టమైనవన్నీ ఎక్కువగా తినేయడంతో లావు పెరిగిపోయాను.

అంటే మీరు చిన్నప్పటి నుంచీ లావు కాదన్న మాట!

లేదండి. చిన్నప్పుడు చాలా సన్నగా ఉండేవాణ్ణి. బెడ్‌రెస్ట్ టైంలో స్వీట్లు ఇష్టంగా ఎక్కువ తినేవాణ్ణి. దీంతో లావవడం మొదలుపెట్టాను. యాక్సిడెంట్ నుంచి కోరుకుని సినిమాలపై మమకారాన్ని చంపుకోలేక మళ్ళీ హైదరాబాద్ వచ్చి అవకాశాల కోసం ట్రై చేయడం మొదలుపెట్టాను. 'ఇది వరకు స్లిమ్‌గా చాలా బాగుండేవాడివి. ఇప్పుడు బాగా లావైపోయావు. హీరోగా ఛాన్సులు కష్టం' అని చాలామంది అన్నారు. సినిమాలనే నమ్ముకున్నాను. ఇక్కడే ఏదో ఒకటి చేయాలనుకున్నాను. నటి హేమది మా ఊరేనని తెలిసి ఆమెను కలిశాను. ఆమె పూరీ జగన్నాథ్‌గారికి పరిచయం చేసింది. ఆ సమయంలో ఆయన 'బాచి' తీస్తున్నారు. ఈ సినిమా తర్వాత ఆయన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేద్దామనుకున్నాను. కానీ 'బాచి' తర్వాత ఆయనకు కొంత గ్యాప్ వచ్చింది. నాకు ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఇంతలో ముంబాయిలో ఫ్యాషన్ ఫొటోగ్రఫీలో ఒన్ ఇయర్ కోర్సు చేసి హైదరాబాద్‌లో ఫొటోగ్రఫీ స్టూడియో పెట్టాను. భారీ పెట్టుబడితో హైలెవెల్ ఎక్విప్‌మెంట్‌తో ప్రారంభించాం. చాలా సినిమాలకు ఫ్రీలాన్స్ ఫొటోగ్రఫీ, ఫొటో సెషన్స్ చేశాం. బేసికల్‌గా నేను బిజినెస్‌మేన్ కాకపోవడంతో చాలా డబ్బు పోగొట్టుకున్నాను.

ఆ తర్వాత దర్శకులు రసూల్‌గారి దగ్గర 'భగీరథ' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఆ సమయంలో సందీప్ అనే ఫ్రెండ్ 'చేపుట్ నీచే' అనే లఘు చిత్రంతీశాడు. అందులో

నేటి 'వినాయకుడు'

జె.కె. బాయ్ అనే మాఫియా డాన్‌గా ప్రధాన పాత్ర పోషించాను. డాన్‌గా నువ్వు సరిపోతావని సందీప్ ఈ వేషం నాతో వేయించాడు. ఈ లఘుచిత్రం ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌కు వెళ్ళింది. దీని ప్రీమియర్ షో చూసి ప్రియదర్శిని రామ్‌గారు 'మనోడు' అనే చిత్రంలో వేషమిచ్చారు. ఎప్పుడూ బీరు తాగి బలంగా ఉండే 'బీర్‌బల్'గా నటించాను. నేను నటించిన తొలి చిత్రం 'మనోడు'. కాకపోతే రిలీజైన చిత్రం మాత్రం 'మొదటి సినిమా'. అక్కడ్నుంచి చిన్న పాత్రల్లో నటించడం మొదలుపెట్టాను. 'పార్టీ'లో డాక్టర్‌గా, 'షాక్'లో రవితేజ ఫ్రెండ్‌గా, 'వీధి'లో ముంబాయి విలన్‌గా నటించాను. 'పోకిరి'లో మహేష్‌బాబు ఫ్రెండ్‌గా నటించాను. ఆ సినిమా సూపర్ డూపర్ హిట్ కావడంతో కృష్ణుడు అనేవాడొకడున్నాడన్న గుర్తింపొచ్చింది. 'ఒక్కడున్నాడు'లో విలన్ మహేష్ మంజ్రేకర్ ఫ్యామిలీ డాక్టర్‌గా నటించాను. ఇందులో డైలాగ్స్ తక్కువున్నా... చాలామంచి పాత్ర పోషించాను. ఆ తర్వాత 'జల్సా', 'మధుమాసం' చిత్రాల్లో నటించాను.

'హ్యాపీ డేస్' నా సినిమా కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇందులో అందరూ కొత్తాళ్ళనే తీసుకుంటున్నారని తెలిసి చిన్న చిన్న పాత్రలు వేశాం కదా అని... అప్లయ్ చేయలేదు. 'మనోడు' సినిమాలో నాతోపాటు నటించిన పృథ్వీ అనే ఫ్రెండ్ 'హ్యాపీ డేస్'లో వేషం కోసం ప్రయత్నించారు. ఓ వర్కింగ్ స్టిల్ తీసుకెళ్ళి శేఖర్ కమ్ములగారికి చూపించాడు. ఆ ఫోటోలో నేను కూడా ఉన్నాను. 'మనోడు'లో బీర్బల్ క్యారెక్టర్ చేశానని చెప్పాను కదా. సాసరులో బీరు పోసుకుని తాగే స్టిల్ అది. చాలా ఇంట్రస్టింగ్‌గా ఉందని పిలిపించారు. 'హ్యాపీడేస్'కు సెలెక్ట్ చేశారు. ఒకే ఒక సీన్ ఉంటుందని ఆయన ముందే చెప్పారు. శేఖర్ కమ్ముల లాంటి డైరెక్టర్ దగ్గర ఒక్క సీన్ చేసినా చాలనుకున్నాను. షూటింగ్‌కు పిలిచారు. మొదటి మూడు రోజులూ నాపై ఒక్క షాట్ కూడా తీయలేదు. ప్రతి రోజూ ఉదయం ఐదింటికల్లా మేకప్‌తో రెడీగా ఉండేవాణ్ణి. నాలుగో రోజు నాపై తొలి షాట్ తీశారు. సీనియర్‌గా జూనియర్ అయిన నిఖిల్ జుట్టు కట్ చేయించే ర్యాగింగ్ సన్నివేశం తీశారు. 'కృష్ణ సీన్‌లో బాగా చేశాడు... మూడు రోజులపాటు ఒక్క షాట్ కూడా తీయకపోయినా అంకితభావంతో పొద్దున్నే టంచన్‌గా వచ్చాడు' అని శేఖర్‌గారు భావించి 'నేను పిలిచినప్పుడల్లా అతన్ని (నన్ను) రమ్మనండి' అని అసిస్టెంట్ డైరెక్టర్‌కు చెప్పారు. మొదట్లో అనుకుంది ఒక్క సీనే అయినా... నా నటన నచ్చి క్యారెక్టర్‌ను డెవలప్ చేశారు. సినిమాలో క్రికెట్ సన్నివేశంలో నాపై కామెడీ బాగా పండింది. సీనియర్‌గా నిఖిల్‌ను ర్యాగింగ్ చేసి ఆడుకుంటాను. అతను నాపై పగ తీర్చుకుని నాకు పిచ్చెక్కిస్తాడు. కాలేజీ అయిపోతుంది. నిఖిల్ ఇంటర్వ్యూకు వస్తే రిక్రూట్‌మెంట్ చేసే ప్యానల్లో నేనూ ఉంటాను. నన్ను చూసి షాక్ అవుతాడు. 'ఈ బండోడు మనకి జాబ్ ఇవ్వడు' అనుకుంటాడు. నేను సీనియర్ అయినా...నువ్వు జూనియర్ అయినా...మనమిద్దరం ఒకే కాలేజీ అని జాబ్ ఇస్తాను. ఆ సీన్ యూత్‌కే కాదు అందరి హృదయాలను సున్నితంగా తాకింది. నేను చాలా సీన్లలో నటించినా.. ఆ ఒక్కసీన్‌లో ఉన్న ఎమోషన్ చాలా గుర్తింపు తీసుకొచ్చింది. 'హ్యాపీ డేస్' రిలీజ్‌కాగానే 'యువ' సీరియల్లో ఆఫర్ వచ్చింది. అన్నపూర్ణ స్టూడియో బ్యానర్‌లో నాగార్జునగారు దీన్ని నిర్మించారు. "హ్యాపీ డేస్' మంచి గుర్తింపు ఇచ్చింది కదా! స్థాయి తగ్గించుకుని సీరియల్లో ఎందుకు నటించాలనుకుంటున్నావ్" అని ఫ్రెండ్స్ అన్నారు. చిన్న చిన్న పాత్రలు ఎన్ని చేసినా... ఎందుకో తృప్తి లేదు. ఇంకా చేయగలను... అనుకున్న రోల్స్ రావడం లేదనుకుంటున్న టైంలో 'యువ'లో నటించే అవకాశం వచ్చింది. అందులోనూ స్క్రిప్ట్ బాగా నచ్చింది. నా క్యారెక్టర్‌ను బాగా డెవలప్ చేశారు. ఎన్నో గొప్ప సినిమాలు తీసిన అన్నపూర్ణ సంస్థలో నటించే అవకాశం రావడంతో ఒప్పుకున్నాను. నాలోని యాక్టింగ్ ప్రాక్టీస్ కావడానికి, నటనలో కాన్ఫిడెన్స్ రావడానికి 'యువ' దోహదపడింది. ఈ సీరియల్‌తో నా మేజర్ ఫ్యాన్స్ చిన్న పిల్లలయ్యారు. ఈరోజు నేనెక్కడికి వెళ్ళినా... చిన్నపిల్లలు నా దగ్గరికి పరిగెత్తుకుంటూ వస్తారు. నవ్వుతుంటారు. నేను మాట్లాడదామనుకునే సరికి పారిపోతుంటారు. 'యువ' సీరియల్ చిన్నపిల్లల అభిమానాన్ని తెచ్చిపెట్టింది. చిన్నపిల్లలది కల్మషం లేని మనసంటారు కదా! అలాంటి పిల్లల అభిమానం చూరగొనడం అదృష్టంగా భావిస్తాను.

కృష్ణుడు 'వినాయకుడు' ఎలా అయ్యాడు?

సాయికిరణ్ అడివి (వినాయకుడు దర్శకుడు), రవి మంచి స్నేహితులు. వీరిద్దరూ 'హ్యాపీడేస్' చిత్రానికి శేఖర్ కమ్ముల దగ్గర అసోసియేట్ డైరెక్టర్స్‌గా పని చేశారు. 'హ్యాపీ డేస్'లో క్రికెట్ ఆడే సన్నివేశంలో నటిస్తున్నప్పుడు రవి నన్ను చూసి నువ్వు రాసుకున్న 'బిగ్‌ఫ్యాట్ లవ్‌స్టోరీ'కి హీరో దొరికాడని సాయికిరణ్‌తో అన్నాడు. ఎవరని అడితే... 'కృష్ణ' అని చెప్పేసరికి 'కృష్ణా..' అంటూ ఆశ్చర్యపడ్డారు. ఇద్దరూ క్రికెట్ సీన్స్ అబ్జర్వ్ చేశారు. 'హ్యాపీ డేస్' రిలీజ్‌కు 20 రోజుల ముందు 'వినాయకుడు' సబ్జెక్ట్ చెప్పారు. కథ చెబుతున్నప్పుడు మొదట్లో ఎంతగా ఎంజాయ్ చేశానో... చివర్లో అంతేలా ఏడ్చేశాను. ఈ కథకు నువ్వే హీరో అని చెప్పేసరికి ఎమోషన్‌తో మరోసారి కళ్ళు చెమ్మగిల్లాయి. సుస్మితాసేన్ విశ్వ సుందరి కిరీటం ధరించినప్పుడు మహదానందంతో కంట తడి పెట్టుకుంది చూశారా! సరిగ్గా అలాంటి భావోద్రేకమే నాలోనూ కలిగింది.

(మరిన్ని వివరాలు పై వారం)





కథ

బుక్క దత్తాద్రి

మా నాన్నకు చదువురాదు. కానీ ప్రతి విషయం తార్కికంగా ఆలోచించేవాడు. సాధ్యాసాధ్యాలూ ముందూ వెనకా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకునేవాడు. అనుకున్న పనిలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ఒక్కక్షణం ఆగి ఆలోచించటం గమ్యం చేరేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు వెదకటమేగానీ వెనక్కి తగ్గటం విరమించటం మే మెరుగం.

- ఎ. జయశంకర్

మాది చాలా చిన్న ఊరు. మేం అయిదుగురం అన్నదమ్ములం. మాతోపాటు మా మేనబావమరిది. పదకొండేళ్ల వయస్సు. పెద్దన్న పదకొండో తరగతిలో ఉంటే మేము ఏడు, ఆరు తరగతుల్లో ఉన్నాం. అందరం ప్రతిరోజూ కాలినడకన ఆరుకిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణానికి వెళ్ళిరావాలి, ఎండాకాలం, వానాకాలం ఏ కాలం అయినా కాలినడకే. ఎండకు ఎండి, వానకు తడవాల్సిందే. పితృ అమావాస్య రోజు పెద్దలకు బియ్యం ఇవ్వటం, కానుకలూ, కట్నాలూ, బ్రహ్మలూ మేమెరుగం. కానీ మేమెప్పుడు మంచి వంటకాలు చేసుకున్నా చాకలి అయిలయ్యనూ, మంగలి పోచయ్యనూ, ఈర్లమంకయ్యనూ (ఈయన మా వ్యవసాయానికి ప్రధాన సలహాదారూ, కూలీ కూడా) పిలువకుండా మేం తినలేదు. పంటకళ్ళాలు, వరికోతలు, చేలల్లో పనులూ ఉన్న రోజుల్లో ఒకరి సద్ది మరొకరు తీసుకుపోవటం అతి సాధారణం.

రాత్రిపూట చేల దగ్గర్నుండి ఇంటికి వచ్చేటప్పుడు టార్చిలైటు వాడే వాళ్ళం. ఆ వెలుగు, వెలుతుర్లో కొన్నిసార్లు మూడు బాటల దగ్గర దించిపోసిన, ఎత్తిపోసి పారబోసిన విస్తరినిండా అన్నం, మాంసం, ఉడికీ ఉడకని పచ్చి కోడిగుడ్లూ, కొట్టి వదిలేసిన కొబ్బరి చిప్పలూ, కోసి పడేసిన నల్లకోళ్ళు కనిపించేవి. వాటి పక్కన చిల్లరడబ్బులూ ఉండేవి. ఇవన్నీ దయ్యాలకూ, భూతాలకూ పెట్టినవనీ, దించిపోసినవనీ ఎవరూ ముట్టేవారు కాదు. అందులో కొన్ని తీసుకోవాలనిపించినా ముఖ్యంగా చిల్లర డబ్బులూ కొబ్బరిముక్కలూ ధైర్యం చాలేది కాదు. ఎప్పుడైనా నేనూ మానాన్న కలిసివస్తే మాత్రం అన్నం తప్ప అన్ని యింటికి తెచ్చేవాడు మానాన్న. కొబ్బరి ముక్కలు కడిగి కోసి, ముక్కలు చేసి, ఎవరో ఇచ్చిన సమ్మక్క సారలమ్మ బెల్లం కలిపి మాకు పెట్టేవాడు. కోడి, కోడిగుడ్లూ వండుకునేవాళ్ళం. "మనం ఇలా చేస్తే దయ్యానికో, భూతానికో, దేవుడికో కోపం రాదా నాన్నా" అని అడిగాం. అప్పుడు మొదలు పెట్టాడు ఈ కథ.

"మన ఊళ్లో బుక్కదత్తాద్రి అని ఉండేవాడు. వాళ్ళ కుటుంబ సభ్యులందరూ ఊరూరూ తిరిగి కుంకుమ, బుక్క, గులాలు, దీపావళి పండుగకు నోము దండలూ అమ్ముకునేవారు. ఒక్కో రోజు పదిపన్నెండు మైళ్ళు, ఇప్పటి భాషలో సుమారు 15, 16 కిలోమీటర్లు కాలి నడకన వెళ్ళి సాయంకాలానికి ఇల్లు చేరుకునేవారు.

అది ఆయిటి బూనిన కాలం. జూలై ఆగష్టు నెలలు అనుకోవచ్చు. పచ్చగా గడ్డి, పిచ్చి మొక్కలూ మొలిచి, కాలిబాట తప్ప తింటా అడుగు వేసేటట్టులేదు. బుక్కదత్తాద్రి తెల్లవారకుండానే లేచి భుజానికి రెండువైపులా వేలాడే బుక్కా గులాల్ సంచిని వేలాడేసుకొని ఊళ్ళ ప్రయాణం బయలుదేరిండు. ఒక్క కాలిబాటే సన్నటి గీతలాగ కనపడింది. తూర్పు దిక్కు తెల్లగా వెలుగొస్తాంది. అప్పుడే తెల్లవారుతోంది. కుటకుటా అంటాంది కడుపు. ఎటుపోదామన్నా గడ్డీ గొరిమండ్లూ. అటూ యిటూ జూసిండు. కొంచెం ముందుకు బోతే ఒడ్డు కనబడి దానిమీద బుక్క గులాల సంచి జాగ్రత్తగాబెట్టి అవుతలికి బొయి వచ్చె వరికే సంచి ఓ మూల కిందికి జారి కొంత కుంకుమ తడువనే తడిసింది. అది అట్లనే ఉంచుతే అంతా ముద్దయి పోతదని గబగబ తడిసిన కాడికి తీసి పొడి కుంకుమ, పెయిమీద కండువల పోసుకున్నాడు. ఈ తడిసిన కుంకుమ ముద్దకు ముద్ద తీసి తొవ్వల (దారిలో) పారేసి ఆలస్యం అయిందని దబా దబా నడక మొదలు పెట్టెండు. ఆసాములు ఆడవాళ్ళు పనులకు బోతే ముందె పోవాల్నని.

చీకటితోనే పటేలు మల్లారెడ్డి పస్టు బస్సుకోసం పట్నం బయల్దేరిండు. సీలింగు భూముల కేసులింక తెగలే. అన్నలు జెండాలు బాతిన భూమి ఎట్లన్న జేసి యస్.సి. కార్పొరేషన్‌కు అప్పజెప్పాలి. శాలమల్లేసు ఎలమ మాధవలకేసు కాంప్రమైజ్ కాకుంట జూసి యిద్దర్నీ యింకో రొండేడ్లన్న తన సుట్టు తిప్పుకోవాలె. పోశమ్మ గుడికి ఎంపీగార్నడిగీ ఫండ్సు దెప్పియ్యాలె. ఎంబడే బోరింగేపియ్యాలె. ఒక్క బోరింగ్ జాలక పక్కనే ఉన్న తన పసుపు తోటంత ఎండిపోకుంట కాపాడుకోవాలి. ఎల్లకాలపు రేవు జేసుకోవాలె. ఈ సంగతి

ఇంకోని కర్థం కాకుంట పనిగావాలె. పటేలుకు అన్ని ఆలోచనలు. ఆలోచనలమీద ఆలోచనలు.

ఆలోచించుకుంట సటుక్కున కిందికి చూచేవరకు నడితొవ్వల ఎర్రగ కుంకుమ ముద్ద.

అప్పుడే కరకర పొద్దబొడ్తాంది. తొవ్వల జూసేవరకు లింగం ఆకారంలో కుంకుమకుప్ప. పటేలు బుర్రపెద్దది. అయ్యేయెస్ అయిటోడెగని సదువక మాలిపటేలు అయిండట. ఎక్కాలాక్క దెబ్బలు దిని, భయపడి సదువు బందుజేసె ఏటికి మాలిపటేలుతోనే సరిపెట్టుకున్నాడు గాని బుర్రశాన పెద్దది. పటేలు బుర్రా మామూలు బుర్రా? చాలా పెద్ద తల్కాయ్. తలుక్కున ఆలోచన మెరిసింది. ఆనంగ వచ్చి పాయెటోళ్లను బిల్చి ఆపిండు. యిటు పొద్దుబొడ్తాంటె అటు కుంకుమలింగం భూమిలకెల్లి పైకొచ్చిందని యిది కండ్లార జూసిన్నని చెప్తుకుంట జేబులకెల్లి పదిరూపాయలు తీసి లింగం పక్కన బెట్టి చేతులు జోడిచ్చిండు. చెంపలేసుకున్నడు. యిక్కడ గుడి గట్టియ్యాల్నంటాండు. ఈ జాగ రెండూళ్ళ నడుమ ఉండబట్టి గంటలోపల నూరుమంది జమ అయిండు. ఎవరోట జూసినా ఆత్మలింగం మాటే. పటేలు పట్నం బందుపెట్టి జీతగాళ్ళు పిలిపిచ్చి సుట్టూ కళ్ళం జెక్కించినట్టు గద్దె జెక్కిచ్చిండు. పూలూ, పండ్లూ, కొబ్బరికాయలూ పైసలూ మొక్కులే మొక్కులు. ఎల్లెర్కయిందోగని జంగం భద్రయ్య ఒంటినిండా విభూతి బూస్కోని ఆడికి జేరిండు. మంత్రాలూ పూజలు మొదలు బెట్టిండు.

రెండూళ్ళ సందున గన్క రెండూళ్ళ పెద్దలు గలసి గుడిగట్టాల్నని తీర్మానం జేసింర్రు. కోమటి సదానందంకైతే మంచి పేరున్నదని అన్ని గుళ్ళకు బొయ్యేది అందరు దేవతలకు మొక్కేది ఆయనొక్కడే అని ఆయన్నే అధ్యక్షుణ్ణి జేసింర్రు. చెయ్యి మంచిదని చందాలు మొదలెడితే ముందుగాలి జయపాల్ రెడ్డి డాక్టర్ దగ్గరికి పోవాలనుకున్నరు. పోనేపోయింర్రు. కండ్లతోని జూసినట్లు పటేల్ అంత జెప్పిండు. రెండూళ్ళ జనం చిన్నోళ్ళున్నరు, పెద్దోళ్ళున్నరు. శానమంది ఏదో ఓ రోగానికి ఏండ్ల తరబడి తన దగ్గరికి వచ్చెటోళ్ళే. వత్తున్నోళ్ళే. డాక్టరు దొర బాగ జూసిండు. ఆయన అదువరకే దావఖాన్లనే ఓ గుడి గట్టిచ్చిండు. రాంగనే బాగుపడాల్నని మొక్కుతురు. సచ్చిపోతే మా కర్మ అని మొక్కి ఉన్నోళ్ళ నన్ను సల్లంగ జూడ మంటరు. యింతవరకు లొల్లి లేకుంట నడుస్తాంది. జరిగిందంతా యిన్నడు. జయపాల్‌రెడ్డి చందా సంగతి తెల్సుకున్నడు...బిడ్డా యింత మందిచ్చిండు దేవునికార్యం నేనెట్ల కాదంట!!

'ఆ గుడి సుట్టూ బండతోని కంపోండు లేపిస్త. బండ, సిమెంట్ - సున్నం, సుతారి కూలి అన్నినాయే. అని రాళ్ళ కాంట్రాక్టర్ మస్తాన్‌కు ఫోన్‌జేసి అర్జంటుగ సరిపోయే బండెయ్యమని, రవ్వసాంబయ్య, శిమిటి సాంబయ్యకు ఫోన్‌జేసిండు. ఉప్పరి కొంరయ్యను బిల్చి పని మొదలు బెట్టి ఆగకుంట నడుపాల్నని బయానిచ్చిండు. డాక్టర్ జయపాల్‌రెడ్డి అందర్నీ చాయ్‌దాగి పొమ్మన్నాడు గని మొదలుపెట్టిన పనిగావాల్నని ఎవ్వరు వద్దన్నారు. జనం ఇక సంబురపళ్ళే. ఆయనకు మొక్కేసి పెద్ద పటేలు, ఊరికి మోతుబరి అని మోహన్‌రెడ్డి పటేలింటికి బొయిండు.

జనం సంబరపడ్డరు. పటేల్ జూసిండు. నాట్లకు, కలుపులకు, కోతలకు, కళ్ళాలకు ఈ రెండూళ్ళ జనం ఎప్పటికి వచ్చిటోళ్ళే. పటేలు నలుగురన్న దమ్ములయి వాళ్ళకు కొడుకులయి, బిడ్డలయినా సర్కార్ల బోకుంట నూటిరువై ఎకరాల పొలంగా పాడిండు. పటేలు కేవలున్నది మనిషి పదెకరాలే అనిపిచ్చుకున్నాడు. మాట బోనీయడు. ఏ పన్జేసినా నష్టం రానీయడు.

బిడ్డా! పిలగాండ్లు హైదరాబాదుల భూములు గొని తెలంగాణ లొల్లి జెయ్యబట్టి యిర్కుటంలబడ్డరు. పైసలెల్వగని మన బోరింగు మిషన్ బంపిచ్చి బోరింగేపిచ్చి పైపులు గట్ల అన్ని "ఫిట్" జేపిత్తనని హైదర్‌మియా డ్రైవర్‌నూ, ఆపరేటర్నూ, బోరింగ్ మిషన్నూ పంపనే పంపిండు.

అక్కణ్ణించి వడ్డీ సావుకారు లక్ష్మణ్ సీటోనూ, ఆర్‌ఎంపీ తోనే ఆపరేషన్లు జేసే పేదోళ్ళడాక్టరూ, పెద్దోళ్ళ సంపాదనా ఉన్న డా॥ సుందరయ్యనూ వరుసబెట్టి పెద్దోల్లందర్నీ కలిసింర్రు. చిత్రం



యింత కరువు కాలంలో ఏడు లక్షలు వసూలయ్యాయి. పన్నెండు నెలలు కార్పస్ ఫండ్ కట్టలేక ఇర్వై ఏండ్లాయ్. హైస్కూల్ అయిత లేదు. రెండూళ్ళల్లా యింకా మిడిలో స్కూల్లే. దేవుని పేరు జెప్పే వరకు పైసలే పైసలు.

ఆత్మలింగం జాగల పాలరాతి లింగం బెట్టాలె. అది రాజస్థాన్‌లదేవాలె. ఆ పని యింద్రయ్య దొర నుంచి దప్ప యింకొకనితో గాదు దొరగుణం మంచిది గాదు ఏ పని జేసినా కమీషన్ గొర్రడు గని జయపాల్ రెడ్డికి దగ్గర. తిన్నా చేసెటోడు గావాలె గదా అంటాడు, జయపాల్‌రెడ్డి దొర. అందరు గల్సి ఆయనకే పనప్ప జెప్పింర్రు. కాన్వార్ల జదినే బిడ్డ దగ్గర్కి. బొయి కర్సుల కుంచుకొమ్మని - దేవుని సొమ్ము, మనసొమ్ము గాదా అనుకొని పనికి తయారయిండు యింద్రయ్య.

చెరువాయె భూమాయె, నలుబయ్ పీల్లుకేసీళ్ళు బడ్డాయి. పుష్కలంద గంగ. సాయంత్రానికల్లా రెండుఫీట్ల ఎత్తు రాతి కంపొండు లేశిండు. మారాజు జనం వచ్చెటోళ్ళు; మొక్కెటోళ్ళు పాయెటోళ్ళు. ఓ మాజీ నక్సలైట్ కొబ్బరికాయల దుకాణం బెట్టిండు. కాంగ్రెస్ కార్యకర్త ఓటలు మొదలు బెట్టిండు. తెలుగు దేశ పాయ్నె పూజ టిక్కెట్లు అమ్ముతాండు. యింతమంది, యిన్ని పార్టీలున్నా ఏం లొల్లి గాయకుంట దేవుని దయతోని తలో పని దొరికిచ్చు కున్నారు. సాయంత్రం అరయింది. బుక్కా గులాలమ్మూకోని కంజెరువు తాళ్ళల్ల కల్లుదాగి యింటి కత్తాడు బుక్కదత్తాద్రి. తొవ్వల జూత్రె ముందే మంది చీమల కుప్పోలిగె. సమజోగాలె. ఒక్కొక్కల్ని తప్పించుకుంట బోయి చూసేవరకు ఏమున్నది. ఎర్రగ - ఆత్మలింగం తాగింది మొత్తం ఒక్క దెబ్బకు దిగిపోయింది. కాళ్ళు జేతులు వణుకబట్టినయ్. ఎవ్వరికి జెప్ప కుంట యింటికి బొయిండు. నోరు దెరిత్తె ఒట్టు.

"మరి నాయినా-యింక బుక్క దత్తాద్రి బతికున్నాడా?"

"యిప్పటిదాక మనిండ్ల సుట్టాకు - పొగాకు అద్కపోయినగా బుక్క ముసలాయేనే బుక్క దత్తాద్రి." అంటూ మా నాయన కథ ముగించాడు.

నవ్వుల్ - పువ్వుల్

మర్చిపోలేను



భార్య: ఏమండీ మీకు గుర్తుందా! సరిగ్గా ఇవ్వాళ్టికి పాతికేళ్ల కిందట మీరు నాకు ఐలవ్‌యు చెప్పి...పెళ్లి చేసుకుందామా! అన్నారు. అసలు అప్పుడు నాకు గంటసేపటి వరకు నోటెంట మాటే రాలేదు. గుర్తుందా!

భర్త: ఆ... ఎలా మర్చిపోతాను. ఈ పాతికేళ్లల్లో నీ నోరు మూత పడింది అప్పుడేగా!

మర్చిపోయా

భర్త: సుజీ! నేను ఉదయం ఆఫీసుకు వెళ్లేప్పుడు గొడుగు తీసుకెళ్లడం మర్చిపోయా?

భార్య: ఆ విషయం ఎప్పుడు గుర్తొచ్చింది?

భర్త: వర్షం ఆగాక గొడుగు ముడుద్దామనుకున్నప్పుడు.

- ఎస్. పద్మ, నంద్యాల

కవిత్వమ్

పైశాచిక కుహరం

- జి. యాదగిరి రావు



అందమైన నగరం
హైదరాబాద్ నగరం
పాలరాతి భవంతులు
పొడుగాటి ఫ్లై ఓవర్లు
రోడ్ల నిండా ఏసీ కార్లు
రాత్రి పగలు తేడాలేని
ఫైవ్ స్టార్ హోటళ్లు
కుర్రకారు కోసం పబ్‌లు
డిస్కోతెక్ చమక్కులు
తినటానికి పిజ్జాలు, బర్గర్లు
తాగేందుకు విదేశీ వైన్లు
షాపింగ్‌కు మాల్‌లు
వినోదానికి మల్టీప్లెక్సులు
రిలాక్స్‌కు మసాజ్ సెంటర్లు
అందాలకు బ్యూటీ పార్లర్లు
ఆట విడుపుకు ఫ్యాషన్ షోలు
శృతి మించితే ఎయిడ్స్ రోగాలు
ప్రపంచీకరణ పరుగులో
వినిమయపు వికృతరూపాలు
గ్యాంగ్ రేపుల పర్వంలో
పసి కూనలు సైతం బలి!
ఆత్మహత్యల పర్వంలో
ఇంజనీర్లు సైతం హరి!
కిడ్నాపుల పర్వంలో
ప్రాణ స్నేహితుడైనా సరి!
కోరినవి సాధించేందుకు
నైతిక విలువలు సరి!
మానవ విలువలు మరిచి
సంపాదనే పరమావధి!
మల్టీ నేషన్ల మచ్చిక కొరకు
పాలకులు పడరాని పాట్లు!
వినిమయం జిలుగులలో
మిణుగురులుగా ప్రజలను
ఆహుతివ్వడమే లక్ష్యం!
అందమైన హైదరాబాద్
మారుతున్నది మృత్యునగరం!
పాలకులు చేస్తున్నారు
ప్రేత, పైశాచిక కుహరం!

✠

- వల్లభాపురం జనార్ధన

జాలి గుండె



అవును
జాత్యాహంకారానిది
నమ్మశక్యం కానంత జాలిగుండె
దాని జాలిలో తడిసి
పునీతం కాని ప్రాణి లేదు
ఆసుపత్రులను నేలమట్టం చేసి
అమాయక బాల్యానికి
అంత్యక్రియలు జరిపిన
దాని జాలి గుణం ముందు
కరుణామయుడైన ఏసూ దిగదుడుపే
తన ఆహార ధాన్యాలను
ఇంధనోత్పత్తికి మళ్లించి
వర్ధమాన దేశాల నోటికాడి కూడును
తన కంచంలో నింపుకుంటున్న
దాని జాలి గుండె ముందు శిబిచక్రవర్తి
దిగదుడుపే
తన కోసం నిశ్శబ్ద సునామీగా
కొరతను సృష్టించి
ప్రపంచాన్ని కొరత వేస్తున్న
దాని దయా సముద్రతకు కొలమానమే లేదు
అవును దానిది నమ్మశక్యం కానంత జాలిగుండె
ప్రపంచ బ్యాంకు
ప్రపంచ వాణిజ్య సంస్థ
ప్రపంచీకరణ
గుణత్రయ గీతా మకరందం తాగించి
మన కాల కృత్యాలను శాసిస్తున్నది కదా
వ్యవసాయాన్ని వ్యాపార దృక్పథంగా
పూయించి కాయించి పండిస్తున్న
అన్నదాతది నమ్మశక్యం కానంత జాలిగుండె
సంపద సృష్టించుకొంటున్న మనం
తిండి యావ పెంచుకుని
పౌష్టికాహారం తినీ తినీ
ధరల పెరుగుదలకు
కారణమవుతున్నామట
ఆహారం ప్రాథమిక హక్కు అన్నది
మరిచి పొమ్మని
ఆత్మ సందర్శనం చేయిస్తున్న
దానిదెంత పరిశోధనాత్మక జ్ఞానమో
గుర్తించండి
అది తాగించిన గీతామకరందాన్ని రుచి
చూసింతర్వాత కూడా
మనకు జ్ఞానోదయం కాలేదంటే
నిజంగా తిండిపోతులమే
ధరల పెరుగుదలకు కారణమే
కోటి డాలర్లు చేసే మాటకు
ఆబగా ఎగబడుతున్న తిండిపోతులమే
గురివింద నీతిని వినిపిస్తున్న
దాని జాలిగుండెలో మునిగి తేలండి
ధరల పెరుగుదలను అరికట్టండి.

*(అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్
భారతీయులు తిండిపోతులని చెప్పిన వార్త చదివి)*

✠

ఆరోగ్యం

ముత్యాల్లాంటి పలువరుస సొంతం కావాలంటే....

కొంతమంది చిరునవ్వులు చిందిస్తే చాలు ముత్యాల్లాంటి పళ్లు తళుక్కున మెరుస్తాయి. ముచ్చటగొలిపే దంత సౌందర్యాన్ని ఆస్వాదించకుండా వుండలేం. 'అబ్బ...మనక్కూడా అలా వుంటే ఎంత బావుండేది?!' అనిపించడంలో ఆశ్చర్యంలేదు. అయితే అదంతా అంత సులభంగా సాధ్యపడదు. కాస్త సమయం వెచ్చించాల్సి వుంటుంది. పళ్లను పరిశుభ్రంగా వుంచుకోవాలి. వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. 'ఇదంతా ఖర్చుతో, శ్రమతో కూడుకున్న వ్యవహారమేమో!' అనిపిస్తుంది చూడ్డానికి. కానీ దంతాలను ఆరోగ్యంగా, అందంగా కాపాడుకోవడం అంత కష్టం కాదు. పైగా ఆరోగ్యవంతమైన దంతాలు సొంతమైతే తెలీని ఆత్మవిశ్వాసం కూడా మనకు తోడవుతుంది. ఎటువంటి సంకోచాలూ లేకుండా మనసారా నవ్వగలుగుతాం. ఎదుటివారితో మాట్లాడగలుగుతాం. అటువంటి దంతసంరక్షణలో ప్రధానమైనది దంతధావనం. దానికి సంబంధించిన వివరాలను ఈ వారం చెప్పుకుందాం.

చరిత.కె

మన శరీర భాగాలన్నింటిలోకి నోటికి చాలా ప్రాధాన్యత వుంది. ఎందుకంటే జీర్ణప్రక్రియ తొలి దశ నోటి దగ్గరే ప్రారంభమౌతుంది. అలాగే మనిషి భావాలు బయటికొచ్చేది కూడా నోటి ద్వారానే. అందుకే దంతాలు, నాలుక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం తప్పనిసరి. అయితే ఇదేం ఖర్చుతో కూడుకున్నది కాదు. దంత సంరక్షణా అలవాట్లు చిన్నతనం నుంచే అలవరచుకోవాలి. మనం మాత్రం చాలా నిర్లక్ష్యం చేస్తాం. వేలకొలది సూక్ష్మాతిసూక్ష్మజీవులు, ఆహారకణాలు నోటిలో వుంటాయి. మీగడలాంటి మేనికోసం, పట్టువంటి కురులకోసం ఎంతో డబ్బు, సమయాన్ని వెచ్చిస్తాం. కానీ నోరు విప్పగానే దర్శనమిచ్చే దంత సంరక్షణ గురించి మాత్రం ఆలోచించం. అంత ప్రాధాన్యతగల ఆరోగ్యవంతమైన దంతాలకోసం కొన్ని విషయాలు...

★ రోజుకు రెండు సార్లు బ్రష్ చేయాలి. అంటే.. పొద్దున్నే, రాత్రి భోజనానంతరం. దీనివల్ల మన నోరు రోజంతా తాజాగా వుండడమే కాకుండా సూక్ష్మజీవులనుంచి కాపాడుతుంది. మంచి టూత్‌పేస్ట్ వాడాలి.

★ పళ్లు తోముకునేటప్పుడు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. అన్ని వైపులా, అన్ని మూలలా, లోపలివైపు, బయటివైపు...అడ్డంగా, నిలువుగా బ్రష్ చేయాలి. బ్రష్‌ని ఇలా నిలువుగా రెండేసి పళ్ల మధ్య వుంచి శుభ్రం చేయడం వలన వాటి మధ్య ఇరుక్కున్న అన్నకణాలు బయటికి వచ్చేస్తాయి. ఇదంతా రెండుమూడు నిముషాల్లో పూర్తవ్వాలి. అయితే కొందరు బాగా గట్టిగా అదిమిపెట్టి పళ్లు రుద్దుతారు. దీనివలన పళ్లమీది ఎనామిల్ పోయే ప్రమాదం వుంది.

★ బ్రష్ చేయడం పూర్తయ్యాక నాలుకను కూడా శుభ్రం చేసుకోవాలి. ఎందుకంటే నాలుకమీద కూడా కనిపించని పాచి పేరుకొని వుంటుంది. రోజూ నాలుకను కూడా శుభ్రం చేసుకోవాలి.

★ అలాగే మనం తీసుకునే ఆహారంమీద కూడా శ్రద్ధ పెట్టాలి. సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. ప్రొటీన్లు, కాల్షియం, పీచు పదార్థం ఎక్కువగా వుండేలా చూసుకోవాలి. నీళ్లు సరిపడా తాగాలి.

★ ఆహారాన్ని బాగా నమిలి మింగాలి. రాత్రి భోజనానంతరం బ్రష్ చేయడం కుదరని పక్షంలో కనీసం నోటిని నీళ్లతో పుక్కిలించి ఊయాలి. దీనివలన పళ్ల మధ్య ఇరుక్కున్న కణాలు బయటికి వచ్చేస్తాయి.

చిన్నతనం నుంచే .....

పళ్లను శుభ్రం చేసుకోవడం అనేది పిల్లలుగా వున్నప్పుడే అలవాటు చేయాలి. పిల్లలకు పాలపళ్లు వచ్చిన దగ్గర నుంచే శుభ్రం చేస్తుండాలి. మనమే మెత్తటి కాటన్ బట్ట తీసుకొని పళ్లమీద సున్నితంగా రుద్దాలి. తమ పనులు తాము చేసుకోవడం మొదలెట్టిన దగ్గర నుంచి పళ్లను శుభ్రం చేసుకోవడం అలవాటు చేయాలి. అదొక పనిలా గాక ఆటలా వుంటే పిల్లలు ప్రతి రోజూ క్రమం తప్పకుండా బ్రష్ చేస్తారు. ఇతర పనులకంటే బ్రష్ చేయడం నిజంగానే తమాషాగా వుంటుంది. అయితే ఇది వారు గుర్తించి ఆనందించేలా చేయాల్సిన పని మాత్రం పెద్దలదే. ఉదాహరణకు చిన్నారులకు మీ బ్రష్ ఇచ్చి ముందర మీ పళ్లను తోమమనండి. అప్పుడు మీరెంతగానో ఎంజాయ్ చేస్తున్నట్లు నవ్వండి. తర్వాత వారి పళ్లను తోముకోమనండి. అలా కాకపోతే మీ పాపాయి బొమ్మ పళ్లను బ్రష్‌తో శుభ్రం చేయించండి. ముఖ్యమైన విషయం ఏంటంటే... బ్రష్ మీద బఠాణీ గింజంత టూత్‌పేస్ట్ మాత్రమే వేయండి. మరీ ఎక్కువ పేస్ట్ వేయడం వల్ల నురగ ఎక్కువగా వచ్చి చిన్నారులు బ్రష్ చేయడం ఇబ్బంది అవుతుంది. అంతేకాకుండా మధ్యమధ్యలో నురగను ఉమ్మి వేయమని చెప్పాలి. కొందరు పిడుగులు మింగేస్తుంటారు. అది మంచిది కాదని చెప్పాలి. ఇంత చిన్నవయసులోనే ఎందుకు నేర్పించాలంటే... ఒక మంచి అలవాటును చిన్నతనంలోనే నేర్పిస్తే ఇంక ఎప్పటికీ అదలా నిల్చిపోతుంది. పైగా కొద్దిరోజులపాటు పిల్లలు బ్రష్ చేసే సమయంలోనే మీరూ బ్రష్ చేసుకోవడం ఉత్తమం. పైగా స్కూలు వయసు పిల్లలు పళ్లు శుభ్రంగా తోముకోకపోయినా, నోటి నుంచి దుర్వాసన వస్తున్నా... తోటి విద్యార్థులు ఏడిపించడం, వెక్కిరించడం, గుంపు నుంచి వేరు చేయడం వంటివి జరుగుతుంటాయి. ఇలాంటివి జరగకూడదంటే ప్రతి రోజూ బ్రష్ చేసుకోవడం ఒక్కటే మార్గమని వారికి చెప్పాలి.

ఇటువంటి ప్రాథమికమైన జాగ్రత్తలు తీసుకుంటే ఎక్కువశాతం దంత సంబంధ వ్యాధులు దరిచేరకుండా చూసుకోవచ్చు.

ఓ మంచి పుస్తకం

విజయ పథం విషాదాంతం

నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నేనెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు-
నెత్తురు కక్కుకుంటూ
నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే-

ఆ: అన్న శీర్షికన శ్రీశ్రీ రాసిన ఈ చిన్న కవిత అత్యంత ప్రసిద్ధమైంది. ఆ: అని మొదట నోరెళ్లబెట్టిన వారే తర్వాత తీసి పారేస్తారని మహాకవి భావం. స్వార్థం, ధనవ్యామోహం నిండిన సమాజంలో ఇది సర్వసాధారణం. దక్షిణ భారత సినీ సామ్రాజ్ఞి సావిత్రి జీవితం ఇందుకు అద్భుతమైన ఉదాహరణ. సున్నితమైనదిగా పరిగణించబడే కళా రంగం వ్యాపారమయమైన సినీ మాయామేయ ప్రపంచంలో - సన్నిహితుల విశ్వాస రాహిత్యం, స్వీయ శిక్షణా రాహిత్యం, ఉన్నత శిఖరాలపై ప్రకృతి సమాజ ధర్మాల చక్రంలో మహిళలు గిజగిజ, ఎవరి ఏ స్థానమూ శాశ్వతం కాదనే వాస్తవాన్ని అంగీకరించలేకపోవడం, ఇలాంటి అనేకానేక కారణాలు సావిత్రి జీవితాన్ని విజయపథం నుంచి విషాదాంతానికి చేర్చాయి.



తెర

రాజకీయ వ్యాపార రంగాలలో తీవ్ర అభిప్రాయ భేదాలుండొచ్చు గాని కళా రంగంలో అందరికీ అభిమాన పాత్రులైనవారి గురించి ఎంత తెలిసినా ఇంకా తెలుసుకోవాలనిపిస్తుంది. వాళ్ల గురించిన ఏ చిన్న విశేషమైనా ఎనలేని ఆసక్తి కలిగిస్తుంది. ఆ కోవలో అగ్రగణ్యురాలు సావిత్రి. తెలుగు తమిళ సినీ రంగాలలో ఒకటి రెండు తరాలకు ఆరాధ్య దేవత. నటనకు నిర్వచనం, ప్రసిద్ధికి పర్యాయపదం సావిత్రి. ఆమె తారలకు తార. సావిత్రి జీవితంలో వెండి వెలుగుల వెంట విషాదపు చీకట్లు కమ్ముకున్న వైనం ఆమె నటించిన ఏ చిత్రంలోనూ చూడనంత నాటకీయంగా అనిపిస్తుంది. సావిత్రిపై వచ్చిన ఒక పుస్తకాన్ని గతంలో ఈ శీర్షికన చెప్పుకున్నా ఇప్పుడు మరో పుస్తకాన్ని కూడా పరామర్శించుకోవడానికి కారణం అదే. గత ఏడాది ఆగస్టులో విడుదలై మూడు ముద్రణలు పొందిన "మహానటి సావిత్రి.. వెండితెర సామ్రాజ్ఞి" పుస్తకం కళాభిమానులెవరినైనా ఇట్టే ఆకర్షిస్తుంది. కారణం అద్భుతమైన ముఖచిత్రమే! లోపలి చిత్రాలు కూడా అందుకు తగ్గట్టే వున్నాయి.

సావిత్రిని అమితంగా అభిమానించిన శ్రీమతి పల్లవి ఈ పుస్తక రచయిత. సీనియర్ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు చిన్న 'ముందుమాట' రాస్తూ "ఈ పుస్తకం చాలా యదార్థంగా సావిత్రి జీవితాన్ని ఆవిష్కరించింది" అని అభిప్రాయపడ్డారు. ప్రముఖ రచయిత రావూరి భరద్వాజ అభిప్రాయం రాస్తూ తెలియని అనేక విషయాలు వెల్లడించిన ఈ పుస్తకంలో తనకు తెలిసిన పలు విషయాలు లేకపోవడాన్ని కూడా ప్రస్తావించారు. ఆ సమగ్రతా లోపం వుండొచ్చు గాని వున్న మేరకు చక్కగా చదివిస్తుంది.

చావు బతుకుల మధ్య కొట్టుకులాడుతున్న సావిత్రి గురించి వినవచ్చిన రకరకాల వ్యాఖ్యానాల ప్రస్తావనతో పుస్తకం మొదలవుతుంది. అక్కడి నుంచి నేరుగా ఆమె బాల్యంలోకి తీసుకువెడుతుంది. 1936 జనవరి 4న గుంటూరు జిల్లా చిర్రావూరులో పుట్టిన సావిత్రికి చిన్నప్పుడే తండ్రి పోయాడు. తల్లి సుభద్ర బతుకుతెరువు కోసం సావిత్రిని, ఆమె కన్నా ముందు పుట్టిన మారుతిని తీసుకుని విజయవాడ చేరింది. పెదనాన్న వెంకట్రామయ్య చౌదరి అండదండలతో ఆ కుటుంబం బతుకు నెట్టుకొచ్చింది. చిన్ననాడే సావిత్రి చురుకుదనాన్ని, చక్కదనాన్ని గమనించిన వారు నాట్యం నేర్పించమని సలహా ఇవ్వడంతో పెదనాన్న చౌదరి అమలు చేశాడు. బెజవాడలో నాటకాలు వేస్తూ సావిత్రి అందరి మెప్పు పొందింది. తర్వాత కాలంలో అన్నపూర్ణ పిక్చర్స్ అధినేత అయిన దుక్కిపాటి మధుసూదన రావు ఆమెను సినిమాల్లోకి వెళ్లవలసిందిగా సూచించారు. పెదనాన్న వెంకట్రామయ్య సావిత్రిని తీసుకొని మద్రాసు బయల్దేరాడు. అప్పుడు ఆమె తొలి స్టిల్ ఫోటోలు తీసిన వ్యక్తి గణేష్ (తర్వాత ఆమె జీవితంలో అనేక మలుపులకు కారణమైన జెమినీ గణేషన్). పెదనాన్న వెంకట్రామయ్య చౌదరి విసుగు చెందని విక్రమార్కుడిలా తిరుగుతూనే వున్నా సావిత్రి నటిగా నిలదొక్కుకోవడానికి కొద్ది సమయం ఆగక తప్పలేదు. 'అగ్ని పరీక్ష' లో వచ్చిన వేషం వయసు చాలక వెనక్కుపోయింది. 'సంసారం'లో నాగేశ్వరరావుతో నటించడానికి బిడియపడేసరికి మరొకరికి ఆ పాత్ర దక్కింది. సావిత్రి కేవలం ఒక పాటలో కొద్దిగా కనిపించడంతో సరిపెట్టుకోవలసివచ్చింది. ఇది భరించలేని పెదనాన్న ఆమెపై చేయి చేసుకున్నాడు కూడా. ఆ దశలో దొరికిన స్నేహితురాలు చాముండి సావిత్రికి ప్రాణసమానురాలై మార్గ నిర్దేశనం చేసింది. ఈ క్రమంలో సావిత్రి విజయవారి 'పాతాళభైరవి'లో ఒక నృత్యంతో అందరినీ ఆకర్షించి ఆ పైన

'పెళ్లిచేసిచూడు'లో ద్వితీయ నాయికగా తనదైన ముద్ర వేసింది (విజయావారి చలవే తనను నాయికను చేసినందున కూతురికి విజయ చాముండేశ్వరి అని పేరు పెట్టుకుంది) అంతే. తర్వాత వెనక్కు తిరిగి చూడవలసిన అవసరం రాలేదు.

'దేవదాసు' సినిమాలో నటించడం సావిత్రికి పెద్ద మలుపు. అప్పటి వరకూ ఆమె హుషారైన పాత్రలే వేసింది. 'పల్లెటూరు, శాంతి, ప్రియురాలు' సినిమాలు కూడా విడుదలైనాయి. 'పల్లెటూరు' ప్రజానాట్యమండలి వారి సినిమా. పెదనాన్నతో సహా అందరూ ఏడుపుగొట్టు పార్వతి పాత్ర వద్దని వారించారు. వాదించారు. అయినా ఆమె ఆ పాత్రను విపరీతంగా అధ్యయనం చేసి తనే ధరించి తీరాలని నిర్ణయానికొచ్చింది.

1953 జూన్ 26న 'దేవదాసు' విడుదలై సావిత్రిని శిఖరాగ్రాలకు తీసుకెళ్లింది. తర్వాత అమాయకుడైన భర్తను అసాధ్యుడిగా తీర్చిదిద్దిన 'అర్ధాంగి' పాత్ర దాన్ని మించిపోయింది. ఆపైన భానుమతి చేస్తున్న 'మిస్సమ్మ' పాత్ర- ఆమె అహంభావంపై చక్రపాణి ఆగ్రహం కారణంగా సావిత్రిని వెతుక్కుంటూ వచ్చింది. ఈలోగా తమిళమూ నేర్చుకుని అదరగొట్టడం మొదలెట్టింది. వెంటపడి హీరోయిన్‌ను చేసిన పెదనాన్న వెంకట్రామయ్య చౌదరి ఆమె సంపాదనతో సామ్రాజ్యం నిర్మించుకోవాలని విఫలయత్నం చేస్తుండగా, ప్రాణసఖి చాముండి పలు విధాల సందేహిస్తుండగా సావిత్రి జిజి అనబడే జెమినీ గణేషన్‌ను రహస్య వివాహం చేసుకుంది. ఇది స్నేహితురాళ్ల మధ్య సంవాదానికి, ఇంట్లో సంఘర్షణకు దారి తీసింది. ఈలోగా గురజాడ 'కన్యాశుల్కం'లోని మధురవాణి పాత్రను మహాద్భుతంగా పోషించింది. రెండో పెళ్లి వాడైన జిజిని తను తిరుపతిలో వివాహం చేసుకున్నట్టు సావిత్రి 1955లో పత్రికల వారికి తెలియజేయడంతో ఒక ఘట్టం ముగిసింది. మరింత కీర్తి మూటకట్టుకుంది. మరో వంక రేఖ తల్లి పుష్పవల్లిని జిజి కొత్తగా పెళ్లి చేసుకున్న వార్తలు.... వీటన్నిటినీ రచయిత్రి ఆసక్తికరంగా రాశారు.

సినిమా రంగంలో సావిత్రి వైభవ ప్రాభవాలను తెలిపే ఘట్టాలు కొన్ని.. 'మాయాబజార్' షూటింగ్ సందర్భంగా గ్లిజరిన్ లేకుండా ఏడుస్తానని, పైగా ఎన్ని చుక్కలు కావాలంటే అన్నే కళ్లనుంచి తెప్పిస్తానని పందెం వేసి గెలుస్తుంది సావిత్రి! పక్కనున్న పితృసమానుడైన ఎస్వీఆర్ పందెం కింద మరో వేషం కోరుకోమని సూచించినా వినకుండా చిన్న మొత్తంతోనే సరిపెట్టుకుంది. అదే షూటింగు సందర్భంలో ఒక సీనియర్ నటి సహాయార్థం జరిగే వేడుకకు తన పారితోషికం మొత్తం ఇచ్చి అందరినీ దిగ్భ్రాంత పరచింది. మద్రాసులో బంగళాలు నిర్మించింది. 1958లో ఆమె నెల తప్పిందని తెలిసి నిర్మాతలు హడలిపోయారు. చాలా జాగ్రత్తగా చూసుకుంది పరిశ్రమ. అప్పటికి పదేళ్ల కిందట చిత్ర రంగ ప్రవేశం చేసిన సావిత్రి అప్పటికి అనేక శిఖరాలధిరోహించింది. 1960లో దర్శకుడు రామినీడు 'చివరకు మిగిలేది' స్క్రిప్టు తీసుకొచ్చాడు (అన్నట్టు దాని నిర్మాత మాజీ మంత్రి ఎమ్మెస్ గారే!). ఆ చిత్ర నాయిక పద్మగా ఎంతో బరువైన పాత్రను పోషించిన సావిత్రి స్పృహ తప్పిపోయిందట. అదే చిత్రం బెంగాలీలో సుచిత్రాసేన్, హిందీలో నూతన్ చేసిన దానికన్నా సావిత్రి నటన కొన్ని రెట్లు మెరుగ్గా వుండటాన్ని సినీ పండితులు సన్నివేశాలు చూపించి మరీ విశ్లేషిస్తుంటారు. 1961 కి వచ్చేసరికి సావిత్రి ప్రతిఫలం హీరోల దరిదాపుల్లోకి వచ్చేసింది. కాళ్లకు కూడా బంగారు ఆభరణాలు పెట్టుకోవడం అందరికీ వింత గొల్పింది. విపరీతంగా ఆస్తులు కొంటున్నా అవి ఎవరి పేరిట వుంటున్నాయో చూసుకోలేనంత బిజీ. నిర్లక్ష్యం కూడా. చేతికి ఎముక లేకుండా దాన ధర్మాలు, అయినవాళ్లనుకున్న వారే కాజేయడం, భర్తతో కూడా వివాదాలు వగైరా.... వీటి మధ్యనే హిందీలోనూ రాణింపు.. 1963లో 'మూగమనసులు, డాక్టర్ చక్రవర్తి, పూజాఫలం తదితర చిత్రాల నిర్మాణం. 1964 నాదీ ఆడజన్మే, దేవత, సుమంగళి, మనుషులు మమతలు..' ఇలా సాగుతూనే వుండగా మలికాన్పు.

సావిత్రి అప్పటికి బాగా లావైపోయింది. గతంలో వలె కాన్పు తర్వాత తగ్గించుకోవడం కుదర్లేదు. అక్కినేని పక్కన సుమంగళిలో ఆయన కంటే పెద్దగా వుందన్నారు. అప్పటి నుంచి ఎన్టీఆర్‌తో ఎక్కువగా వేయడం. 1964 తర్వాత ఆమె ప్రాభవం తగ్గుముఖం పట్టింది. లావవడం ఒక్కకారణం మాత్రమే. అసలు కారణం నాయిక పాత్రల్లో వచ్చిన మార్పు. నాజూకుగా చూపాలంటే ఆమె సరిపోదు. జయలలిత వంటి కొత్తమ్మాయిలు వచ్చేశారు. ఈత దుస్తుల్లోనూ నటించేస్తున్నారు. పరిశ్రమ పద్ధతులు మారిపోతున్నాయి.... 1967 సావిత్రి నటించిన చాలా చిత్రాలు విడుదలై విజయాలు సాధించాయి. కాని పెద్దరికపు పాత్రలు వస్తున్నాయి. వెండితెర వేల్పుగా వెలుగొందిన ఆమె ఇలాంటి పరిస్థితిని భరించగలదా అని అంతకు ముందు నుంచి ఆత్మీయులు శ్రేయోభిలాషులు ఆందోళన చెందుతూనే వున్నారు. నిజంగా అంత పని జరిగింది. ఆ సంఘర్షణాత్మక కాలంలో సావిత్రి 'చిన్నారి పాపలు' దర్శకత్వం చేపట్టింది. మొదట్లో మహిళల వుమ్మడి చిత్రం అనుకున్నా తర్వాత భారమంతా ఆమెపైనే పడి బాగా నష్టం మూటకట్టుకుంది. తెలుగులో సరిగ్గా ఆడకపోయినా తమిళంలో భర్తను హీరోగా పెట్టి మళ్లీ తీసి చేతులు కాల్చుకుంది. ఆ దశలోనే ఆమె మద్యానికి మరీ ఎక్కువగా బానిసై పోయింది. అయినవాళ్లు వారించినా సరిదిద్దుకోలేకపోయింది. వున్నది హారతి కర్పూరంలా హరించుకుపోవడం మొదలైంది. భర్త పట్టించుకోకపోగా మరో పెళ్లి చేసుకున్నట్టు వార్తలు.. ఇవన్నీ ఇంకా ఇంకా ఘర్షణకు గురి చేశాయి. ఆ బాధలో విషాదానికి బదులు తమాషా చిత్రం చేయాలని 'వింత సంసారం' తీసి మరింతగా నష్టపోయింది. 'మూగమనసులు' శివాజి గణేషన్‌తో 'ప్రాప్తం' పేరిట తీసి మరో నష్టం తెచ్చుకుంది. జిజిపైన కోపంతో మరింతగా తాగుతూ విశృంఖలంగా వ్యవహరించసాగింది. బాధను లెక్కపెట్టనట్టు కనిపించడానికి దండగమారి కార్యక్రమాలతో ఖర్చులు పెంచుకున్నది. చివరకు ఇదంతా విషవలయంగా మారింది. 1974 కు పూర్తిగా మత్తులో కూరుకుపోయిందిట. ఆమె సొమ్ము దాచిపెడతామని తీసుకెళ్లిన వాళ్లు అడ్డం తిరిగారు. 1977 నాటికి ఇంద్రవైభవం ముగించి అద్దె ఇంట్లోకి మారింది. అందాల సావిత్రి ఇప్పుడు సావిత్రమ్మ అయిపోయింది. రక్తహీనత, మధుమేహం ముదిరి కళా ప్రపూర్ణ వదనం కాంతి విహీనమై పోవడం మొదలెట్టింది. ఆమె నటించిన ఏ చిత్రంలోనూ లేనంత విషాదం గూడు కట్టుకుపోయింది.

1980లో కోమాలోకి వెళ్లిపోయింది. మళ్లీ కోలుకోలేదు. ఆమెను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. వ్యసనాలను సాకుగా చూపుతూ పూర్తిగా వదిలేశారు. ఆపైన సహాయం తీసుకోవడానికి నిరాకరిస్తుందని ఆమెపైనే నెపం పెట్టారు. ఆస్పత్రికి తీసుకెళ్లినా వైద్యం చేయకుండా బయటే పెట్టారు. ఇవన్నీ తెలియని అచేతనావస్థలో - ఆఖరి దశలో తనకోసం దక్షిణ భారత చలన చిత్ర మండలి కేటాయించిన రు10 వేలు అందుకోకుండానే- కోమాలో 596 రోజులు గడిపిన సావిత్రి 1981 డిసెంబరు 26న ఆఖరి శ్వాస విడిచింది. తర్వాత సంతాపాలు అశ్రుతర్పణలూ షరా మామూలే.

ఇంత విషాదాంతంగా జీవితం ముగించిన సావిత్రి నటించిన చిత్రాలు ఎన్నో తెలుసా? తెలుగులో 142 (ఇందులో 80 వరకూ నాయికగానే), తమిళంలో 94, ఇతర భాషల్లో మరో పది. ఈ పుస్తకంలో పల్లవి సావిత్రి ఉద్థాన పతనాలను హృద్యంగా ఆర్ద్రంగా చిత్రించారు. అయితే సహజంగానే పూర్తి సంతృప్తి కలగదు. ముఖ్యంగా అంచెలంచెలుగా నటిగా ఎదిగిన సావిత్రి నటనా రీతులు శిక్షణ వంటివాటిపై మరింత సమాచారం వుంటే బావుండేది. కాని అది అలభ్యమై వుండొచ్చు. జెమినీ గణేషన్ ఆమె జీవితంలో పోషించిన పాత్ర పరిమితంగానే స్పృశించబడుతుంది. సావిత్రి కష్టాలకు ఆమె లేనప్పుడు చాముండి వాస్తు విరుద్ధంగా ఈతకొలను తవ్వించడమేనన్నట్టు రాయడం హేతుబద్ధం కాదు. అయినా ఈ పుస్తకంలో సావిత్రి వ్యక్తిత్వం చక్కగా ఆవిష్కరించబడింది. ఆమెను అత్యంత సజీవంగా మన మధ్యనుంచే చక్కటి చిత్రాలు, ఆమె గురించిన తొలినాటి వార్తల క్లిప్పింగులు, ఇంటర్వ్యూలు, ప్రశ్నలూ సమాధానాలు,చేతి రాత వంటి విశేషాలను జతపర్చారు. సినిమా ప్రియులుగా, మరీ ముఖ్యంగా సావిత్రి అభిమానులకు ఎంతైనా సంతోషం కలిగించే పుస్తకం. ✠

మహానటి
సావిత్రి
(వెండితెర సామ్రాజ్ఞి)
పల్లవి
వెల : **200/-**, పేజీలు : **342**,
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు.

పేరేమిటి?

ఇక్కడ ఇద్దరు సీక్రెట్ ఏజెంట్లు కోడ్ భాషలో చెప్పకుంటూ పేపర్‌లో ఏదో చూపించుకుంటున్నారు గమనించారా! మొదటి వ్యక్తికి రెండవ వ్యక్తి ఇలా రాస్తే తన పేరుకరెక్టుగా వస్తుంది అని చెప్తున్నాడు. ఇంతకీ ఆ రెండవ వ్యక్తి చెప్పేది మీకేమైనా అర్థమైందా? అసలు అతని పేరేమిటి?



బాలనేస్తాలు

రంగులేద్దాం



పక్షుల పేర్లు చెప్తారా...

ఇక్కడ బోలెడు అక్షరాలు కనిపిస్తున్నాయిగా. వాటిలో కొన్ని పక్షుల పేర్లు దాగి ఉన్నాయి. అయితే అవి అడ్డంగా, నిలువుగా ఎలాగంటే అలా ఉన్నాయి. మరి అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకుని రాయండి. కొద్దిగా కష్టమే మరి. కానీ ఈ పని చేస్తే మీకు బోలెడు పక్షుల పేర్లు తెలుస్తాయి. తెలియకపోతే మాత్రం కింద జవాబు చూడండి.

F	I	H	A	W	K	O	S	T	R	1	C	H
L	B	U	Z	Z	A	R	D	V	G	J	Y	P
A	I	R	N	P	H	E	A	S	A	N	T	U
M	S	E	C	O	N	D	O	R	N	T	P	F
I	S	A	J	F	A	L	C	O	N	L	A	F
N	H	G	O	O	S	E	R	S	E	A	R	I
G	E	L	P	A	R	R	O	T	T	R	T	N
O	R	E	R	V	S	J	W	A	V	K	R	N
K	O	O	K	A	B	U	R	R	A	W	I	R
R	N	K	E	S	T	R	E	L	L	R	D	O
P	E	N	G	U	I	N	J	I	V	E	G	B
V	U	L	T	U	R	E	I	N	L	N	E	I
C	A	N	A	R	Y	P	I	G	E	O	N	N

జవాబు : BUZZARD, CANARY, CONDOR, CROW, EAGLE,FALCON,FLAMINGO, GANNET,GOOSE,HAWK,HERON,IBIS,KESTREL, KOOKABURRA, LARK, OSTRICH, PARROT, PARTRIDGE, PENGUIN, PHEASANT, PIGEON, ROBIN, STARLING, VULTURE, WREN.

పైపెక్కడ?

కుర్చీలో కూర్చున్న తాత పేపర్ చదువుతూ ఏదో ఆలోచిస్తున్నాడు కదూ. ఏం లేదు. తాత తాగే సిగార్ పైప్ కనిపించడంలేదంట. దానికోసం ఎక్కడ పెట్టానబ్బా అని ఆలోచిస్తున్నాడు. మీకేమైనా కనిపించిందేమో చూడండి.

జవాబు : కుర్చీ పక్కనున్న చేతి కర్ర మొదట్లో ఉంది.

ఎవరబ్బా...!

పిల్లలూ... ఇక్కడ ముగ్గురు సముద్రపు దొంగలు కిందున్న నిధి కోసం సొరంగం తవ్వారు. కానీ ముగ్గురిలో ఒక్కరు తవ్విన సొరంగం గుండా వెళ్తేనే నిధి దొరుకుతుంది. ఇంతకీ నిధి ఎవరికి దొరుకుతుందో మీరు కనిపెట్టారా



ఏమంటాం?

ప్రభుత్వమంటే ప్రజలకొరకు, ప్రజల చేత, ప్రజలే ఎన్నుకోబడటం అని అబ్రహం లింకన్ చెప్పారు కదూ. అయితే ఈ పద్ధతిని ఏమంటారో మీరు ఇంగ్లీషులో చెప్పండి. చెప్పడం వద్దులే కానీ, కింద ఇచ్చిన బాక్సులో ఆపేరుకు సంబంధించిన అక్షరాలన్నీ ఉన్నాయి. మరి వాటన్నింటిని ఏరి కిందున్న ఖాళీలో రాయండి.

C	B	P	A	J
Z	C	R	Y	I
A	J	P	Z	M
P	Z	I	J	B
I	P	O	D	J
E	B	I	B	Z

_ _ _ _ _ _ _ _ _

జవాబు : DEMOCRACY

ఏంటో అది?

మీకు ఇంగ్లీషు అక్షరాలు ఎ నుండి జడ్ వరకు తెలుసు కదూ! అయితే కింద వాటిలో కొన్ని అక్షరాలు మిస్సయ్యాయి. అవేంటో కనిపెట్టి చెప్తారా. మీకో క్లూ కూడా ఇస్తున్నాం. ఆ కనిపించని అక్షరాలన్నీ కలిపి చదివితే ఒక సంగీత వాయిద్యం పేరు వస్తుంది.



జవాబు: guitar



ఒకేలా ఉన్నవేవో...

చూశారుగా ఈ బొమ్మని మొత్తం తొమ్మిది భాగాలుగా చేశారు. అయితే రెండు భాగాలు మాత్రం అచ్చంగా ఒకేలా ఉన్నాయర్రా. మరి ఆరెండు ఏవో కనిపెట్టి చెప్పండి

జవాబు: 1ఎ,3బి.

అట్టమీది కథ

ఉగ్రవాదం

దీనికి తన, మన లేదు

స్వాతంత్ర్యానంతరం మతోన్మాద ఉగ్రవాద తూటాకు బలైన జాతి పిత మహాత్మాగాంధీ పుట్టిన గడ్డమీదే ఆయనను బలితీసుకున్న గాడ్సే కూడా పుట్టాడు. ఉగ్రవాదం, మతోన్మాదం కవల భూతాలు. అవి మైనారిటీ కావచ్చు, మెజారిటీ కావచ్చు. నేను పుట్టి పెరగటానికి నువ్వే కారణమని ఉగ్రవాదం అంటే, నేనూ అదే మాట అంటున్నా అని మతోన్మాదం రెట్టిస్తుంది. ఈ రెండు ప్రమాదాలు మన దేశానికి చాలా కాలంగా ఉన్నాయి. ఇప్పుడు మరింత ప్రమాదకరంగా మారాయి. గతనెలాఖరులో ముంబైలో చెలరేగిన ఉగ్రవాదుల దుశ్చర్యలను చూసి జాతి యావత్తు ఒక్కసారిగా నిరుత్తురాలైంది. అదే సమయంలో మన జాతీయ భద్రతా బలగాలు ఉగ్రవాదుల పీచమణచటంలో చూపిన తెగువ, సాహసానికి జాతి యావత్తూ నివాళి అర్పించింది. దేశం మొత్తం ఏకమై ఖండించాల్సిన తరుణంలో దీని నుంచి రాజకీయలబ్ధి పొందేందుకు ప్రధాన ప్రతిపక్షం భారతీయ జనతా పార్టీ ప్రయత్నించటం విచారకరం, గర్హనీయం.

ఎం. కోటేశ్వరరావు



ఉగ్రవాదం, టెర్రరిజం ముంబైకి కొత్తకాదు. అయోధ్యలో కాషాయ తాలిబాన్లు బాబరీ మసీదును కూల్చివేసిన తరువాత ముంబైలో జరిగిన దాడుల్లో 900 మంది దుర్మరణం పాలయ్యారు. తరువాత 1993 మార్చి 12న జరిగిన బాంబుదాడుల్లో మరో 250 మంది ప్రాణాలు కోల్పోయారు. 2003లో కారుబాంబులు పేల్చి మరో 50 మందిని బలిగొన్నారు. రెండు సంవత్సరాల క్రితం 2006లో ఏడు చోట్ల రైల్వే స్టేషన్లు, రైళ్లలో పేలుళ్లు జరిపి 180 మందిని హతమార్చారు. ఈ ఉదంతాల కంటే భిన్నమైనది తాజా ఉదంతం. ముంబై తాజ్‌మహల్ హోటల్, ట్రైడెంట్ హోటల్, నారిమన్ హౌస్‌లను కేంద్రాలుగా చేసుకొని మారణ హోమం సృష్టించిన ఉగ్రవాదుల దుర్మార్గం ప్రపంచ ఉగ్రవాద రక్తసిక్త చరిత్రలో కొత్త పుటలకు నాంది పలికింది. సముద్రమార్గాల ద్వారా కూడా ఉగ్రవాదులు ఏ దేశంలోకైనా ప్రవేశించి మారణ హోమం సృష్టించవచ్చని రూఢి అయింది. ఒక్కసారిగా ప్రపంచ దేశాలను ఉలికిపాటుకు గురి చేసింది.

ఈ దాడిలో పాల్గొన్నవారిలో ప్రాణాలతో దొరికి పోయిన ఉగ్రవాది వెల్లడించిన సమాచారం ప్రకారం పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో శిక్షణ పొందిన పాక్ ఉగ్రవాదులే ఈ దుర్మార్గానికి పాల్పడ్డారు. తాము హైదరాబాద్‌కు చెందిన



వారమన్నట్లుగా మన కమాండోల చేతుల్లో దుర్మరణం చెందటానికి ముందు వారు ప్రకటనలు చేయటాన్ని, మాట్లాడటాన్ని బట్టి చూస్తే దీని వెనుక పెద్ద కుట్రే ఉన్నట్లు భావిస్తున్నారు. అదింకా బయటకు రావాల్సి ఉంది. అంతే కాదు హైదరాబాదులోని మక్కామసీదులో, రాజస్థాన్‌లో అజ్మీర్ దర్గాలో పేలుళ్లు ఎవరు జరిపారనేది ఇప్పటికీ అంతుచిక్కని రహస్యమే. బిజెపి చెబుతున్న ప్రకారం ఉగ్రవాదులందరూ ముస్లింలే అనే ప్రచారమే నిజమైతే మరి తమ మసీదుల్లో తామే పేలుళ్లు జరిపి తమ వారినే బలితీసుకుంటారా? మాలెగావ్‌లో కాషాయ ఉగ్రవాదులు బాంబులు పేల్చి హిందువులను హతమార్చినట్లుగా విచారణలో బయటపడింది. మరో ఐదు చోట్ల కాషాయ ఉగ్రవాదుల హస్తం బయట పడింది. దేశంలో మతపరమైన విభజన తెచ్చి ఓటుబ్యాంకులను ఏర్పాటు చేసుకొని రాజకీయ ప్రయోజనం పొందేందుకు కొన్ని శక్తులు ఇలాంటి దుర్మార్గానికి పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది.

భయోత్పాతం కలిగించటాన్నే టెర్రరిజం అంటున్నాం, ఆ చర్యలకు పాల్పడిన వారిని టెర్రరిస్టు అని పిలుస్తున్నాం. అందువలన ఎవరైతే సమాజాన్ని భయపెడతారో వారందరూ టెర్రరిస్టులే అనవచ్చు. వీరికి మతం,ప్రాంతం, రంగు, భాష, ఎత్తు, పొడవు తేడాలు ఉండవు. ఒక ప్రాంతాన్ని లేదా దేశాన్ని, దేశాలను తమ పెత్తనం కిందకు తెచ్చుకొనేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తే అది వ్యక్తిగత టెర్రరిజంగా పరిగణిస్తాము.

అమెరికా జరిపిన ఒక విశ్లేషణలో టెర్రరిజానికి ప్రపంచంలో వంద అర్థాలున్నాయని తేలింది. ఉదాహరణకు మనం విప్లవవీరులుగా కీర్తించే భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు బ్రిటీష్ వారి దృష్టిలో టెర్రరిస్టులు. పాలస్తీనా దేశం కోసం, ఇజ్రాయెల్ దాడులలో చెల్లాచెదురైన అరబ్బులను ఒక చోటకు చేర్చేందుకు ఆవిర్భవించిన పాలస్తీనా విమోచనా సంస్థ, హమస్ వంటివి పాలస్తీనియన్ల దృష్టిలో దేశభక్త సంస్థలు. అమెరికా నందంటే నంది పందంటే పంది అనే పశ్చిమ దేశాల దృష్టిలో అవి ఉగ్రవాద సంస్థలు. ఇలాంటి ఉదాహరణలను ఎన్నో ఇవ్వవచ్చు. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి సామ్రాజ్యవాద దేశాలు తమకు లొంగని, తమ ప్రయోజనాలకు తోడ్పడని దేశాలను లొంగదీసుకొనేందుకు వాటికి టెర్రరిస్టులను ఆదరించే దేశాలని పేరు పెట్టటం, అలాంటి దేశాలలో విచ్ఛిన్న చర్యలకు టెర్రరిస్టులను ప్రయోగించటం ఇటీవలి కాలంలో మామూలైంది. ఈ దేశాలకు ఇజ్రాయెల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటివి పావులుగా ఉపయోగపడుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికన్లు నాగసాకి, హిరోషిమా నగరాలపై వేసిన అణుబాంబుల ఉదంతం టెర్రరిస్టు చర్య కాదా? ఆ సమయంలోనే జర్మన్లు లండన్ నగరంపై చేసిన దాడిలో టెర్రరిజం లక్షణాలు లేవా? బిజెపి కూడా తన రాజకీయ ప్రయోజనాలకు ఉగ్రవాదులను వాడుకుంటోంది. ముస్లింలందరూ ఉగ్రవాదులు కాదు, కానీ ఉగ్రవాదులందరూ ముస్లింలే అని అది ప్రచారం చేస్తున్నది. దీనిలో వాస్తవం ఉందా? ముంబై తాజా ఘటనలో ప్రాణాలర్పించిన మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక దళ నాయకుడు హేమంత కర్కారే మాలెగావ్ పేలుళ్లపై దర్యాప్తు జరిపి దాని వెనుక 'అభినవ్ భారత్' పేరుతో వ్యవహరించిన కాషాయ దళ ఉగ్రవాదులు ఉన్నట్లు మిలిటరీ అధికారితో సహా ఎబివిపిలో పని చేసిన ఒక సాధ్వి, స్వామీజీ తదితరులను అరెస్టు చేసిన విషయం తెలిసినదే. వారంతా హిందువులే. అదే విధంగా అస్సాంలో ఉగ్రవాదులుగా మారినవారందరూ హిందువులే. ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మిజోరాం వంటి రాష్ట్రాలలోని ఉగ్రవాదులలో క్రైస్తవులు ఉన్నారు. కాశ్మీర్‌లో ముస్లింలు, పంజాబ్‌లో సిక్కులు ఇలా చెప్పుకుంటూ పోతే ఉగ్రవాదులందరూ ముస్లింలే అన్నది కేవలం తప్పుడు ప్రచారమే. మన పక్కనే ఉన్న శ్రీలంకలో తమిళ ఉగ్రవాదులు ముస్లింలు కాదు హిందువులు, వారి స్థావరాలలో అనేక దేవాలయాలున్నాయనే అంశం తెలిసినదే. మన దేశంలోని కాషాయ దళాలు ఈశాన్య రాష్ట్రాలలో తీవ్రవాదుల దుశ్చర్యలు, మారణహోమం గురించి పల్లెత్తు మాటనరు. బంగ్లాజాతీయులు మన దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న మాట నిజం. శ్రీలంక, అనేక ఇతర దేశాల వారు కూడా అక్రమంగానే ప్రవేశిస్తున్నారు. కానీ కాషాయ దళాలకు వారు మాత్రమే కనిపిస్తారు. లంక నుంచి వచ్చే ఉగ్రవాదులు కనపడరు.

ఉగ్రవాదుల కుట్రలను పసిగట్టటంలో, దొరికిన సమాచారాన్ని పట్టించుకోకపోవటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం తాజా ముంబై ఘటన వెల్లడిస్తున్నది. ఈ ఉదంతం తరువాత అమెరికా ఒక ప్రకటన చేసింది. సెప్టెంబరులోనే హోటళ్లు, వ్యాపార కేంద్రాలపై ఉగ్రవాదుల దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు భారత ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు పేర్కొన్నది. ఇంత పెద్ద దేశంలో హోటళ్లు, వ్యాపార కేంద్రాలు అనేక ముఖ్య నగరాల్లో ఉన్నాయి. ఇటువంటి నిర్దిష్టతలేని



హెచ్చరికలే కేంద్రం నుంచి రాష్ట్ర పోలీసులకు అందుతుంటాయని, ఏదైనా ఒక ఘటన జరిగితే తాము ముందుగానే హెచ్చరించామని కేంద్ర సంస్థలు తమ తప్పిదం లేదని తప్పించుకో చూస్తాయన్న విమర్శ ఉంది. ఈ సారి ముప్పు సముద్రం మీద నుంచి వస్తుందని మనకు సెప్టెంబరులోనే సమాచారమందిందన్నది ఇంకొక వార్త. ఇది కూడా అలాంటిదే. సముద్ర తీరం కొన్ని వేలకిలోమీటర్లు ఉన్నది. తూర్పు,పశ్చిమ, దక్షిణ దిక్కుల్లో ఎటునుంచి ముప్పు వస్తుందో తెలియకపోతే ఎక్కడ జాగ్రత్తలు తీసుకోవాలన్నది ప్రశ్న. కొన్ని సందర్భాలలో తప్పుదారి పట్టించటానికి కూడా ఉగ్రవాద సంస్థలు ఇలాంటి సమాచారాన్ని ప్రచారంలో పెడుతుంటాయి. ఇదొక రకమైతే జ్యోతిష్కులు కొందరు సిద్ధంగా ఉంటారు. సంఖ్యాశాస్త్రం ప్రకారం ఇలాంటి ఉదంతాలు జరుగుతుంటాయని తాము ముందే హెచ్చరించామని గడిచిపోయిన వాటిని కొన్నింటిని ఉదాహరిస్తుంటారు.

ముంబైలో నవంబరు 26వ తేదీ అలాంటిదేనని కొందరు సూత్రీకరిస్తూ దానికి గోద్రా ఉదంతం కూడా 26వ తేదీనే జరిగిందని చెప్పారు. నిజానికి గోద్రాలో జరిగింది 2002 ఫిబ్రవరి 27వ తేదీన. ఇలా ఉంటాయి.

అసలు ఉగ్రవాదం ఎప్పుడు పుట్టింది?

ఒక మతం మరో మతాన్ని దెబ్బతీసేందుకు, ఒక రాజు మరో రాజుపై ఆధిక్యత సాధించే క్రమంలో ఉగ్రవాద చర్యలకు పాల్పడటం ప్రపంచ చరిత్రలో మనకు కనిపిస్తుంది. అందుకే అది ప్రధానంగా పాలకవర్గాల ఆయుధంగా చెప్పవచ్చు. అయితే కొందరు నిజాయితీపరులు కూడా ఇలాంటి దగ్గర దారులతో తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవచ్చని భావించి పాలకవర్గాలపై అలాంటి చర్యలకు పాల్పడిన ఉదంతాలు చరిత్రలో ఉన్నాయి. రష్యాలో నియంత జార్ చక్రవర్తిని హతమారిస్తే దోపిడీ అంతం అవుతుందని లెనిన్

...కమలనాథుల బండారం ఇది

బిజెపి 1999 అక్టోబరు 13 నుంచి 2004 మే 19 వరకు కేంద్రంలో అధికారంలో ఉంది. ఈ కాలంలో ఉగ్రవాదుల దాడులకు ఎంత మంది బలైందీ గమనించవచ్చు. దిగువ వివరాల్లో నక్సల్స్ హింసాకాండలో మరణించిన వారిని కలపలేదు. 1994 నుంచి 2007 మధ్య 14 సంవత్సరాల్లో వివిధ ఉగ్రవాద చర్యల్లో మరణించిన వారి సంఖ్య 52,734 కాగా 1999 నుంచి 2004 వరకు అంటే బిజెపి ఐదేళ్ల పాలనా కాలంలో మరణించిన వారి సంఖ్య 24,885 మంది. అంటే తొమ్మిదేళ్ల ఇతర పార్టీల పాలనలో ఎందరు మరణించారో ఒక్క బిజెపి పాలనలోనే అంతమంది మరణించటాన్ని బట్టి ఉగ్రవాదుల పట్ల తాము కఠినంగా వ్యవహరించామని చెప్పుకోవటం గోబెల్స్ ప్రచారం తప్ప మరొకటి కాదు. బిజెపి పాలనలో మరణించిన 24,885 మందిలో పౌరులు 8,210 మంది, భద్రతా సిబ్బంది, 3,749, ఉగ్రవాదులు 13,116 మంది ఉన్నారు.

సంవత్సరం	పౌరులు	భద్రతాదళాలు	ఉగ్రవాదులు	మొత్తం
1994	1696	417	1919	4032
1995	1779	493	1603	3875
1996	2084	615	1482	4181
1997	1740	641	1734	4115
1998	1819	526	1419	3764
1999	1377	763	1614	3754
2000	1803	788	2384	4975
2001	1693	721	3425	5839
2002	1174	623	2176	3973
2003	1187	420	2095	3702
2004	886	434	1322	2642
2005	913	287	1319	2519
2006	1104	388	1273	2765
2007	1009	404	1185	2598
మొత్తం	20264	7520	24950	52734

సోదరుడు భావించారు. అది మార్గం కాదని తరువాత కాలంలో అక్టోబరు విప్లవానికి నాయకత్వం వహించిన లెనిన్ సోదరుని చర్యను సమర్థించలేదు. యూదులను ఎదుర్కొనే క్రమంలో డాగన్ దేవాలయం వద్ద ఆత్మాహుతికి పాల్పడి మూడువేల మంది మరణానికి శాంసన్ కారకుడయ్యాడని ఓల్డ్ టెస్టమెంట్‌లో ఉన్నట్లు కొందరు అభిప్రాయపడుతున్నారు. రోమన్లనుంచి తమ దేవాలయాన్ని స్వాధీనం చేసుకొనేందుకు, జెరూసలెంను పట్టుకొనేందుకు క్రీస్తుశకం 66-70 సంవత్సరాల్లో యూదుల మత బృందం ఉగ్రవాద చర్యలకు పాల్పడినట్లు చెబుతారు. ఈజిప్టు దేశరాజరిక వారసత్వపోరులో క్రీస్తు శకం 1090 ప్రాంతంలో షియా-సున్నీ తెగల పోరులో భాగంగా సున్నీ ప్రముఖులను అంతమొందించేందుకు హంతక ఉగ్రవాదులను పంపినట్లు చరిత్ర చెబుతోంది. ఇటువంటి ఉగ్రవాద చరిత్ర మనకూ తక్కువేమీ లేదు. శైవ, వైష్ణవ తగాదాల్లో ఒకరి ఆలయాలను మరొకరు ఆక్రమించుకొని తమ ఆలయాలుగా మార్చుకోవటం, బౌద్ధారామాలను ధ్వంసం చేసి దేవాలయాలుగా మార్చటం అందరికీ తెలిసినదే. దీనిని రాజ్య ఉగ్రవాదం అంటారు. ఆఫ్ఘనిస్తాన్‌లు బమియాన్ బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేస్తే తప్పన్నారా? కాషాయతాలిబాన్లు అయోధ్యలో బాబరీ మసీదును కొద్ది గంటల్లోనే కూల్చి వేసి అక్కడ రామాలయాన్ని నిర్మించేందుకు చేసిన ప్రయత్నం మన కళ్ల ముందే జరిగింది కదా ! అదే విధంగా వారణాసిలోని మసీదును కూల్చివేస్తామని బెదిరించిన సంగతి తెలిసినదే. ఉగ్రవాదం ఫలానా రంగంలో తలెత్తదని చెప్పలేము. ఉదాహరణకు అమెరికాలో గర్భస్రావాలు చేయించుకోవటాన్ని సహించలేని కొందరు ఈ చర్యలు క్రైస్తవానికి విరుద్ధమంటూ దాడులు చేసి అనేక మందిని హతమార్చిన ఉదంతాలు ఉన్నాయి. ఉగాండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'లార్డ్స్ రెసిస్టెన్స్ ఆర్మీ' పేరుతో ఉన్న ఉగ్రవాదులు తాము దేవుని ప్రతినిధులమని చెప్పుకొంటూ జనంపై చేయని దుర్మార్గం లేదు. వారి యూనిఫాంలో ఒక తెల్లని బైబిల్‌ను కూడా ఉంచుకుంటారు. అందువలన ఏతావాతా తేలేదేమిటంటే ఉగ్రవాదానికి మతం, ప్రాంతం, భాషతో పనిలేదు. వామపక్ష ఉగ్రవాదులు కూడా మత ఉగ్రవాదులకేమీ తీసిపోరు. మత ఉగ్రవాదులు ఇతర మతావలంబకులను హతమారిస్తే వామపక్ష ఉగ్రవాదులు తమతో విభేదించిన ఇతర వామపక్షవాదులను హతమార్చటం అందరికీ తెలిసినదే.

మన దేశంలో ఉగ్రవాదం ప్రబలటానికి అవసరమైన భౌతిక పరిస్థితులు పుష్కలంగా ఉన్నాయి. తమ తరువాత సూపర్ పవర్ భారత్ అని కీర్తిస్తున్న అమెరికా అసలు లక్ష్యం ఏమిటో చాలా మంది గ్రహించటం లేదు. ప్రపంచంలోని ప్రతి ముగ్గురు దరిద్రులలో ఒకరు మనదేశంలోనే ఉన్నారని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. కడుపు నింపుకోను కూడా కాసులు లేని వారు అత్యధికులైతే ఉగ్రవాదుల దాడులకు గురైన తాజ్‌మహల్ హోటల్లో ఒక రోజు ఉండటానికి ఇరవై వేల రూపాయలు చెల్లించి ఉండేవారు కూడా మన దేశంలో గణనీయంగా ఉన్నారంటే అంతరాలు ఎలా ఉన్నాయో ఇది తెలియచేస్తుంది.

ఉగ్రవాదుల పట్ల తాము మాత్రమే కఠినంగా వ్యవహరించి దేశాన్ని రక్షిస్తామని చెప్పుకొంటున్న బిజెపి పాలనలోనే పార్లమెంట్ భవనంపైనే దాడి జరిగితే దిక్కులేదు. నిఘా సంస్థల వైఫల్యానికి ఇంతకంటే ప్రబలనిదర్శనం ఏముంటుంది. అంతేనా 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసినపుడు బిజెపి ప్రభుత్వం హైజాకర్లతో రాజీపడి పాకిస్తాన్ స్థావరంగా పని చేసే జైషే మహమ్మద్ ముఠా నాయకుడు అహమ్మద్ ఉమర్ షేక్‌ని విడుదల చేసింది. వాడు తరువాత రెండేళ్లకు అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ విలేకరి డేనియల్ పెరల్‌ను హత్య చేశాడు. ఉగ్రవాదుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న మహారాష్ట్ర ఏటిఎస్ అధికారి కర్కరే మరణానికి సానుభూతిగా బిజెపి తన ప్రకటనలో ఒక్క ముక్క కూడా పేర్కొనలేదు. ఆ పార్టీ ముఖ్యమంత్రి మాత్రం కోటి రూపాయల సహాయం ప్రకటించాడు. తమకు ఆ సొమ్ము అవసరం లేదని కర్కరే కుటుంబం తిరస్కరించింది.

ఆఫ్ఘనిస్తాన్‌లోని కమ్యూనిస్టు అనుకూల ప్రభుత్వాన్ని కూలదోయటానికి అమెరికా తాలిబాన్ ఉగ్రవాదులను తయారు చేసింది. ఆ అవసరం తీరిన తరువాత ఏకుమేకైనట్లు ఆ తాలిబాన్లే ఇప్పుడు అమెరికాకు వ్యతిరేకంగా తయారయ్యారు. తాలిబాన్లకు శిక్షణ ఇవ్వటానికి పాక్ ప్రభుత్వం తన భూభాగాలను అనుమతించటమేగాక అన్ని రకాలుగా రక్షణ కల్పించింది. అది న్యాయమే అని జనాన్ని నమ్మించింది. ఇప్పుడు అదే తాలిబాన్లపై చర్య తీసుకుంటామంటే జనం అడ్డం తిరుగుతున్నారు. అందువలన ఒకసారి పాముకు పాలు పోసి పెంచిన తరువాత అది ఎవరూ దొరక్కపోతే పాలుపోసిన చేతినే కాటువేసి తన దురద తీర్చుకుంటుంది. మన దేశానికి వ్యతిరేకంగా పాకిస్తాన్, ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చినవాటిలో అమెరికా కూడా ఉంది. అవసరం కోసం దుర్మార్గుడితో స్నేహం చేస్తే వాడి వ్యతిరేకులు స్నేహం చేసిన వారిని కూడా శతృవులుగానే చూస్తారు. ఇప్పుడు మన ప్రభుత్వం అమెరికాకు మన దేశాన్ని జూనియర్ భాగస్వామిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నందున భారత్ వ్యతిరేకతను నరనరాన జీర్ణించుకున్న ఉగ్రవాదులు అంతతేలికగా తమ వ్యతిరేకతను వదులుకోరని అనేక ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు ఇంతకాలం తమకు మద్దతు ఇచ్చిన అమెరికా ఇప్పుడు భారత్‌తో స్నేహంగా ఉండటం ఏమిటనే ఆగ్రహంతో మనదేశంపై కూడా దాడులకు తెగబడుతున్నట్లు కనిపిస్తున్నది. ఒక దశలో మన ప్రభుత్వమే శ్రీలంక తమిళతీవ్రవాదులకు తమిళనాడులో శిక్షణ ఇచ్చిన ఉదంతాన్ని కూడా మర్చిపోరాదు. తరువాత వారిని అణచేందుకు మన ప్రభుత్వమే సైన్యాన్ని పంపింది. అందుకు ఆగ్రహించిన ఎల్‌టిటిఇ తీవ్రవాదులు మన ప్రధాని రాజీవ్‌గాంధీని బలితీసుకున్నారు.

ఉగ్రవాదుల దాడి వెనుక ఎవరున్నారు?

పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థ తమ వెనుక ఉన్నట్లు పట్టుబడిన ఉగ్రవాది వెల్లడించాడు. వారి వెనుక ఎవరున్నారనేది తేలాలి. తాము లేమని పాక్ ప్రభుత్వం చెబుతున్నదానిని నమ్మాల్సిన పనిలేదు. దీని వెనుక శివసేన, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ ఉన్నాయని బ్రిటన్‌లోని దళ్ ఖాల్సా ప్రతినిధి వ్యాఖ్యానించాడు. ఇంటర్నేషనల్ సాలిడారిటీ మూవ్‌మెంట్ అనే సంస్థ ఫ్రెంచి శాఖ ఈ దాడుల వెనుక అమెరికా సిఐఏ, పాక్ ఐఎస్ఐ, ఇజ్రాయెలీ మొసాద్ ఉన్నట్లు పేర్కొన్నది. ఉగ్రవాదుల తీరుతెన్నులను చూసిన తరువాత అలాంటి శిక్షణ ఈ సంస్థలు మాత్రమే ఇవ్వగలవని పేర్కొన్నది. భారత్‌లోని బిజెపి-ఆర్ఎస్ఎస్ కోరిక మేరకు సిఐఏ, మొసాద్ పథకాన్ని రూపొందించి ఉగ్రవాదులకు సహాయం చేశాయని అన్నది. నారిమన్ హౌస్‌లోని యూదులను హతమార్చటం ద్వారా ఇజ్రాయెల్‌తో సంబంధాలను మరింత పటిష్టపరచుకోవటమే వారి లక్ష్యమని తెలిపింది. ఐఎస్ఐలో కొన్ని విభాగాలను సిఐఏ, మొసాద్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తాయని, కొన్ని ఎవరు ఎక్కువ మొత్తం చెల్లిస్తేవారికి కిరాయికి వస్తారని తెలిపింది. తన కుటుంబానికి లక్షన్నర రూపాయలు ఇస్తామని తమను పంపిన వారు వాగ్దానం చేసినట్లు ముంబైలో పట్టుపడిన ఉగ్రవాది వెల్లడించిన అంశం తెలిసినదే. ఈ అంశాలు ప్రభుత్వం విచారణ జరిపి నిగ్గు తేల్చాలి.



చేప వేపుడు

కావలసినవి

చేప ముక్కలు - 10, ఉప్పు - తగినంత
కారం - తగినంత, పసుపు - చిటికెడు
అల్లం వెల్లుల్లిముద్ద - 1 టేబుల్ స్పూను, గరం మసాలా - 1 టేబుల్ స్పూను
సోయా సాస్ - 1టీ స్పూను, ఆరంజ్ ఫుడ్ కలర్ - 1/2 టీ స్పూను
పెరుగు - 1 టేబుల్ స్పూను, పాలు- 1 టేబుల్ స్పూను
గుడ్డు -1, కొత్తిమీర - 1 కట్ట
పొదీనా- 1 కట్ట, మొక్కజొన్న పిండి - 1 టేబుల్ స్పూను
మైదా- 1 టేబుల్ స్పూను, నూనె - వేయించటానికి సరిపడా

పైన చెప్పినవన్నీ కలిపి 2 గంటలు నాన పెట్టాలి. తరువాత బాండీలో నూనె పోసి కాగిన తర్వాత ఆ ముక్కలను వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. ఉల్లిపాయలు, నిమ్మకాయ చెక్కలతో అలంకరించుకుంటే సరి. ఇదే పద్ధతిలో చికెన్ ముక్కలతో కూడా ఫ్రై చేసుకోవచ్చు.



బగారా బేంగన్ కర్రీ

కావలసినవి

వంకాయలు - అరకేజీ, నూనె - తగినంత
ఉప్పు - తగినంత, కారం- తగినంత
పసుపు - చిటికెడు, అల్లం వెల్లుల్లి ముద్ద - 1 టేబుల్ స్పూను
గరం మసాలా- 1 టేబుల్ స్పూను,
వేయించిన పల్లీ పొడి - 2 టేబుల్ స్పూను
వేయించిన నువ్వుల పొడి -1 టేబుల్ స్పూను
చింతపండు రసం - నిమ్మకాయంత , కొత్తిమీర -1 చిన్న కట్ట
ఉల్లిపాయలు -2, పచ్చిమిరపకాయలు - 4

వంకాయలను శుభ్రం చేసుకుని వాటిని నాలుగు ముక్కలుగా కోసుకోవాలి. వీటిని నూనెలో వేపుకుని పక్కన పెట్టుకోవాలి. బాండీలో ఒక గరిటె నూనె వేసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలను వేపుకోవాలి. పల్లీలపొడి, నువ్వులపొడి, గరం మసాలా, అల్లంవెల్లుల్లి ముద్ద, ఉప్పు కారం పసుపు వేసి కొంచెం వేగనిచ్చాక చింతపండు రసం వేసుకోవాలి. అది మరుగుతుండగా వేయించిన వంకాయలను వేసి కూర దగ్గరకు వచ్చేవరకు ఉడికించి స్టౌమీద నుండి దింపుకోవాలి. పైన కొత్తిమీర తరుగు చల్లుకోవాలి.

పనస తొనలు

కావలసినవి

మైదా - అరకేజీ
డాల్డా లేదా నెయ్యి - 100గ్రాములు
పంచదార - పావుకేజి
యాలకులు - 10
నూనె - వేయించటానికి సరిపడా

మైదాపిండిని జల్లించి ఉంచుకోవాలి. డాల్డా కరిగించి వేడి వేడి డాల్డాని మైదాపిండిలో పోసి పిండిని బాగా మెదపాలి. కొద్దికొద్దిగా నీళ్లుపోసి చపాతీ ముద్దలా కలుపుకోవాలి. రెండు గంటలు నానబెట్టాలి. తరువాత ఈ పిండిని చిన్న చిన్న ముద్దలుగా చేసుకుని చపాతీల్లా వొత్తుకోవాలి. చాకుతో చపాతీ మధ్య భాగంలో రిబ్బన్ లాగా కోసుకోవాలి. అంచులు చుట్టుకుని నూనెలో వేపుకోవాలి. ఇలా వేయించుకున్న వాటిని తీగ పాకం పట్టిన పంచదారలో ముంచి వెంటనే తీసుకోవాలి. కరకరలాడే పనసతొనలు రెడీ.



ఆలూ పరోటా

కావలసినవి

బంగాళ దుంపలు - అరకేజీ
ఉల్లిపాయలు - 2 పెద్దవి, పచ్చిమిర్చి - 6
నిమ్మకాయ - సగం చెక్క ఉప్పు - తగినంత
కారం - తగినంత, పసుపు - చిటికెడు
అల్లం వెల్లుల్లిముద్ద - 2 టేబుల్ స్పూన్లు
గోధుమ పిండి - అరకేజీ, నూనె - వేయించడానికి తగినంత

స్టఫింగ్

బంగాళ దుంపలు ఉడకబెట్టి మెత్తగా మెదుపుకోవాలి. బాండీలో నూనె వేసుకొని ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేయించుకోవాలి. తర్వాత అల్లం వెల్లుల్లిముద్ద, ఉప్పు కారం పసుపు వేసుకుని మెదుపుకున్న బంగాళ దుంప ముద్దను వేసి బాగా కలపాలి. స్టౌ మీద నుండి దింపిన తర్వాత నిమ్మకాయ పిండుకోవాలి. ఈ కూరని నిమ్మకాయంత ఉండలుగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి.

గోధుమ పిండిని చపాతీ ముద్దలా కలుపుకోవాలి. ఉండలు చేసుకుని చిన్నగా వొత్తుకోవాలి. అందులో కూర ముద్దను పెట్టి చుట్టూ మూసేసుకోవాలి. అప్పుడు దానిని చపాతీలా వొత్తుకోవాలి. దానిని పెనంపై రెండు వైపులా నూనె వేసుకుని కాల్చుకోవాలి. తయారైన ఆలూ పరోటాను టమాటో సాస్‌తో తింటే యమ రుచిగా ఉంటుంది.



కె.అరుణ

తెలుసుకుందామా...

శిక్షణా సమయంలో కూడా నిజమైన బుల్లెట్లను ఉపయోగిస్తారంటే వీరికి శిక్షణ కూడా ప్రాణాంతకమే అని తెలుసుకుంటే నిజంగా ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఎందుకంటే గురితప్పితే తన సహచరుడి ప్రాణాలకే ముప్పు. ప్రపంచంలో ఉగ్రవాదులు, వారిని ఎదుర్కొన్న దళాలు ఎదుర్కొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాటిలో శిక్షణ ఇస్తారు. అందుకే శిక్షణ నిరంతరం కొనసాగుతుంది. కమాండోలకు బులెట్ ప్రూఫ్ జాకెట్ ఇస్తారు. అది ఏకె-47, 7.62 ఎంఎం బులెట్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. మరొక ముఖ్య విషయం ఏమంటే కమాండోలు ఎప్పుడూ ఒంటరిగా ఉండరు. బృందాలుగా కలిసే విధి నిర్వహణ, చివరికి సెలవులు కూడా.



సత్య

కృష్ణ చక్రం వంటి బ్లాక్ కాట్ కమాండోలు

నల్లపిల్లి కమాండోలుగా(బ్లాక్ కాట్ కమాండోలు) మనందరికీ తెలిసిన మన నేషనల్ సెక్యూరిటీ గార్డుల గురించి ఇటీవల ముంబైలో ఉగ్రవాదుల ఏరివేత సందర్భంగా వారి సత్తా, తెగింపు ఏమిటో జనానికి మరింతగా తెలిసింది. అయితే మనకు తెలియని విషయాలు కూడా ఉన్నాయండోయ్. ఇలాంటి కమాండోలను తయారు చేయాల్సిన అవసరం ఉందని 1984లో జరిగిన బ్లూస్టార్ ఆపరేషన్ వెల్లడించింది. ముంబైలోని తాజ్‌హోటల్, ఒబెరాయ్, నారిమన్ హౌస్‌లను ఆక్రమించుకున్న ఉగ్రవాదులను తరిమివేసేందుకు ఆపరేషన్ బ్లాక్ టార్నడో, ఆపరేషన్ సైక్లోన్ అనే పేరుతో వ్యూహం రచించినట్లుగానే అమృతసర్‌లోని సిక్కుల బంగారు దేవాలయంలో తిష్టవేసిన ఉగ్రవాదులను తరిమివేసేందుకు సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌కు బ్లూస్టార్ అని పేరు పెట్టారు. ఆ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సైన్యం పాల్గొన్నది. దాదాపు 36 గంటలపాటు శ్రమించి ఉగ్రవాదుల చెరనుంచి బంగారు దేవాలయాన్ని విడిపించారు. అయితే అందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. అధికారిక వివరాల ప్రకారం మొత్తం 492 మంది పౌరులు మరణిస్తే వారిలో ఉగ్రవాదులుగా గుర్తించిన వారు కూడా ఉన్నారు. మరో 86 మంది గాయపడ్డారు. సైన్యంలో నలుగురు అధికారులతో మొత్తం 83 మంది మరణించారు, 248 మంది గాయపడ్డారు. అనధికారిక లెక్కల్లో మిలిటరీ, పౌరులు, ఉగ్రవాదుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. ఈచర్య పెద్ద వివాదాన్ని రేపింది. దాంతో ఉగ్రవాదులను ఏరివేసే సందర్భాలలో మరణాలు, నష్టం తక్కువగా ఉండే విధంగా ప్రత్యేక శిక్షణ పొందిన దళాన్ని ఏర్పాటు చేయాలని 1985లో పార్లమెంట్ నేషనల్ సెక్యూరిటీగార్డుల చట్టాన్ని చేసింది. ఈ దళం పూర్తిగా వివిధ విభాగాల నుంచి ఎంపిక చేసిన వారితో కూడినదిగా ఉంటుంది. ప్రస్తుతం 14,500 మంది కమాండోలు దీనిలో ఉన్నారు. వీరికి హర్యానాలోని మనేసార్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ముంబై అనుభవంతో కమాండో యూనిట్లను దేశంలోని మరికొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఉగ్రవాదులను ఎదుర్కోవటంతో పాటు హైజాకింగ్‌లు, బాంబులను నిర్వీర్యం చేయటం, ఉగ్రవాదుల చెరలో చిక్కిన బందీలను రక్షించటంతో ప్రముఖులకు భద్రత కల్పించటం వంటి ప్రత్యేక పనులకే వీరిని వినియోగిస్తారు. వీరిలో స్పెషల్ యాక్షన్ గ్రూప్, స్పెషల్ రేంజర్ గ్రూప్ అని రెండురకాల విధులు నిర్వహించే వారు ఉంటారు. తొలిగ్రూప్‌లో ఉండేవారిని సైన్యం నుంచి, రెండవ గ్రూప్‌వారిని ఇతర పారామిలిటరీ, రాష్ట్రాల పోలీసుల నుంచి ఎంపిక చేస్తారు. వీరు నిర్వహించే కార్యకలాపాలకు అనుగుణంగా వీరిని మరికొన్ని బృందాలుగా చేసి ఆయా రంగాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఉదాహరణకు బాంబులను నిర్వీర్యం చేయటం వంటివి. భద్రతా కారణాల రీత్యా ఈ కమాండోలు బయటివారికి అంతగా తెలియకుండా జాగ్రత్తపడతారు. అందుకే కళ్లు మాత్రమే కనిపించేలా నల్లని యూనిఫారం ధరిస్తారు.



ఈ కమాండోలు ఎలాంటివారంటే ఎన్ఎస్‌జి ఒక మాజీ డైరెక్టర్ జనరల్ మాటల్లో 'పురాణాల్లో కృష్ణుడి చేతిలోని సుదర్శన చక్రం మాదిరి ఎవరిని అంతమొందించాలో ఆపని చేసి తిరిగి కృష్ణుడి చేతికి అమరిపోయినట్లుగా ఈ దళం అత్యంత వేగంగా వెళ్లిపోతుంది, దాడి చేసి, తన కార్యక్రమం పూర్తికాగానే అంతేవేగంగా వెనక్కి వస్తుంది. ఈ దళం ఏర్పడినప్పటి నుంచి పని చేస్తున్న కల్నల్ వికె దత్ ఏమంటారంటే 'రోజూ వందలాది నమూనా అంశాలలో శిక్షణ ఉంటుంది. కీలకమైనది ఫిట్‌నెస్, ఆకస్మికంగా స్పందించటం. ఆకస్మికం అంటే మేం వస్తున్నట్లు ఉగ్రవాదులకు తెలియదని కాదు, మేం ఎప్పుడు వస్తామో, ఎలా వస్తామో, ఎలాంటి టెక్నిక్కులు, ఆయుధాలు వినియోగిస్తామో వారికి తెలియని విధంగా మా కదలికలు ఉంటాయి.'

మొత్తం నేషనల్ సెక్యూరిటీ గార్డులలో 54శాతం మంది స్పెషల్ యాక్షన్ గ్రూప్‌వారు ఉంటారు. మిగిలిన వారు స్పెషల్ రేంజర్ గ్రూప్. వీరికి 90 రోజుల్లో ప్రత్యేక శిక్షణ పూర్తి అయి, కమాండోగా పనికి వస్తారని నిర్ధారణ అయిన తరువాతే మిగిలిన అంశాల్లో శిక్షణ ఇస్తారు. దీనికి ఎంపిక చేసిన వారందరూ కమాండోలుగా ఎంపిక కారు. నూటికి 50 నుంచి 70 మంది వరకు ప్రాథమిక పరీక్షలోనే అనర్హులుగా

బయటపడతారు. ఉదాహరణకు 26అంశాల్లో అర్హత పొందితేనే ఎంపిక అవుతారు. ఉదాహరణకు 26 అంశాలలో 780 మీటర్ల ఆటంకాలను కేవలం 18 నిమిషాల్లో పూర్తి చేయటం. ఒకవేళ 25 నిమిషాల్లో పూర్తి చేస్తే శిక్షణకు పనికివస్తాడని పరిగణిస్తారు. కేవలం తొమ్మిది నిమిషాల్లోనే పూర్తి చేస్తే ఉత్తములుగా పరిగణిస్తారు. మరో పరీక్ష కంబాట్ రూమ్ షూట్. ముంబై తాజ్ హోటల్‌లో కమాండోలు ప్రవేశించినపుడు గదులన్నీ చీకటిగా ఉన్నాయి. అలాంటి పరిస్థితిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందుకుగాను ప్రాథమిక పరీక్షల సమయంలో అభ్యర్థిని టార్చ్‌లైట్ లేదా లేజర్ పరికరాన్ని ఇచ్చి ఒక చీకటి రూములోకి పంపుతారు. మూడుసెకన్లలో వాటి సాయంతో తన లక్ష్యం ఎక్కడుందో కనిపెట్టి వ్యవహరించాలి. ఇది ఒక్క చీకటిలోనే కాదు కళ్లు దిమ్మతిరిగే జిలుగు వెలుగు ఉన్నపుడు కూడా ఎలా వ్యవహరించాలో పరీక్ష పెడతారు. ఇవి పూర్తి అయిన తరువాత వారిని కమాండోలుగా తీసుకొని తదుపరి శిక్షణ ఇస్తారు. ఈ కమాండోలకు ప్రధానంగా తలపై గురి చూసి కాల్చటంలోనే శిక్షణ ఇస్తారు. ఎందుకంటే ఉగ్రవాదిని అదుపు చేయటం ప్రధానం. ముఖ్యంగా ఉగ్రవాది అతిసమీపంలో ఉన్నపుడు ఇతర శరీరభాగాలపై కాల్చేందుకు అవసరమైన వ్యవధి ఉండదు. అందుకు గాను నాలుగువంద మీటర్ల పరిధిలో ఆరున్నర నిమిషాల్లో 29 లక్ష్యాలను కాల్చేవిధంగా శిక్షణ ఉంటుంది. ఇంకా ఇలాంటివే అనేకం ఉంటాయి. శిక్షణా సమయంలో కూడా నిజమైన బుల్లెట్లను ఉపయోగిస్తారంటే వీరికి శిక్షణ కూడా ప్రాణాంతకమే అని తెలుసుకుంటే నిజంగా ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఎందుకంటే గురితప్పితే తన సహచరుడి ప్రాణాలకే ముప్పు. ప్రపంచంలో ఉగ్రవాదులు, వారిని ఎదుర్కొన్న దళాలు ఎదుర్కొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాటిలో శిక్షణ ఇస్తారు. అందుకే శిక్షణ నిరంతరం కొనసాగుతుంది. కమాండోలకు బులెట్ ప్రూఫ్ జాకెట్ ఇస్తారు. అది ఎకె-47, 7.62 ఎంఎం బులెట్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. మరొక ముఖ్య విషయం ఏమంటే కమాండోలు ఎప్పుడూ ఒంటరిగా ఉండరు. బృందాలుగా కలిసే విధి నిర్వహణ, చివరికి సెలవులు కూడా. వీరిని ప్రముఖుల రక్షణకు కూడా వినియోగిస్తారని చెప్పుకున్నాం కదా. ఆ బృందంలో ఎవరైనా ఆ ప్రముఖుడికి ముప్పు తలపెట్టినట్లు భావిస్తే తన సహచరుడిని నిర్దాక్షిణ్యంగా కాల్చివేసేందుకు ప్రతి ఒక్కరికీ అధికారం ఇస్తారు. ఒక్కొక్క కమాండో ఏడాది పొడవునా ప్రాక్టీసు చేసేటపుడు సగటున 2000 వేల గుళ్లను కాలుస్తాడు. ఇది గాక ఏడాదిలో రెండు నెలల పాటు అప్రమత్తంగా ఉన్నారా లేదా అని పరీక్షించేందుకు ప్రత్యేకమైన శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో సగటున ఒక కమాండో 14000 బులెట్లను కాలుస్తాడు. వాటిలో 85శాతం గుళ్లు లక్ష్యాన్ని తాకితేనే ఈ దళంలో కొనసాగుతారు. అంటే దాదాపు ప్రతి రోజూ ఎంతో మెలకువగా, ఉగ్రవాదులతో పోరాడుతున్నట్లే గడపాల్సి ఉంటుంది. ఈ కమాండోలు కేవలం తుపాకి కాల్పులలో నిష్ణాతులు కావటమే గాక ఆధునిక నిఘాపరికరాల గురించి కూడా ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ వాటిని వినియోగించాల్సి ఉంటుంది.

నేషనల్ సెక్యూరిటీ గార్డులలో చిన్న యూనిట్‌లో ఐదుగురు ఉంటారు. ఇద్దరిద్దరు రెండు బృందాలుగా ఉంటారు. ఐదో సభ్యుడు వారికి సాంకేతిక సహాయం అందచేస్తాడు. దీన్ని హిట్ అని పిలుస్తారు. ఇలాంటి నాలుగు హిట్‌లకు ఒక కెప్టెన్ ఉంటారు. పరిస్థితి తీవ్రతను బట్టి ఎన్ని హిట్‌లను ఉపయోగించాలనేది నిర్ణయిస్తారు. సమాచారం అందిన అర్థగంటలోగా ఒక టీము అంటే 50 నుంచి 90 మంది వరకు ఉంటారు. వారిని రవాణా చేసేందుకు ఒక రవాణా విమానం ఢిల్లీలోని పాలం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మేము శతృవుల పట్ల అణుబాంబుల వంటి వారిమని కల్నల్ దత్ అంటారు. దక్షిణాసియాలోని ఇలాంటి గార్డులలో ఎన్ఎస్‌జి ప్రథమ స్థానంలో ఉంది. ఇటీవలి కాలంలో జడ్ ప్లస్ తరగతిలో ఉన్న ప్రముఖులకు ఎన్ఎస్‌జి కమాండోల రక్షణ ఇస్తున్నారు. వీరి అవసరం కంటే ఆ ప్రముఖుల హోదాకు చిహ్నంగా వారున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం అలాంటి వారు 19 మంది ఉన్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి రక్షణను క్రమంగా తొలగిస్తున్నారు. దీంతో రక్షణ చర్యలకు అవసరమైన సిబ్బంది మరింతగా అందుబాటులోకి వచ్చింది. ఎన్ఎస్‌జి పశ్చిమాసియాలోని కొన్ని దేశాలకు భద్రతా సలహాదారు పాత్రను కూడా పోషిస్తోంది.

నేషనల్ సెక్యూరిటీ గార్డులు ఇప్పటి వరకు నిర్వహించిన ప్రధాన ఆపరేషన్లు

ఆపరేషన్ బ్లాక్ థండర్-2 సందర్భంగా 1988 మే 12న వెయ్యిమంది కమాండోలు అమృతసర్‌లోని బంగారు దేవాలయాన్ని చుట్టుముట్టారు. మూడువందల అడుగుల ఎత్తున ఉన్న నీటి టాంకుపైకి కూడా ఎక్కారు. ముందుగా ఆలయంలోకి ఎవరూ రాకుండా చుట్టూ కమాండోలు నిలబడ్డారు. ఉగ్రవాదులపై దాడికి అవసరమైన వ్యూహం పన్నిన తరువాత మే 15న ఆలయశిఖరాలకు కన్నాలు చేసేందుకు మెషిన్‌గన్‌లు, రాకెట్లను పేల్చారు. ఆ కన్నాల్లోకి భాష్పవాయువు గోళాలను పేల్చి అక్కడెవరూ ఉగ్రవాదులు లేరని నిర్ధారించుకున్న తరువాత ఇతర చర్యలు తీసుకున్నారు. మే 18 నాటికి మొత్తం ఉగ్రవాదులు ఎన్ఎస్‌జి కమాండోలకు లొంగిపోయారు. ఈ దాడిలో ఇద్దరు కమాండోలకు గాయాలయ్యాయి. ఈ ఉదంతం తరువాత పంజాబ్‌లో ఎన్ఎస్‌జి బెటాలియన్ ఒకటి ఏర్పాటు చేసి ఉగ్రవాదులను ఎదుర్కోవటంలో పంజాబ్ పోలీసులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఆపరేషన్ అశ్వమేధలో విమానంలోని 141 మంది ప్రయాణీకులను కాపాడారు. హైజాకర్ తేరుకొనేలోగానే కాల్చి చంపారు.

1999 జూలై 15న కాశ్మీర్‌లోని ఒక బిఎస్ఎఫ్ శిబిరంపై ఉగ్రవాదులు దాడి చేసి ముగ్గురు అధికారులను మరొక అధికారి భార్యను హత్య చేశారు.మరో 12మందిని బందీలుగా పట్టుకొని ఒక ఇంట్లో పెట్టి తాళం వేశారు. వారిని రక్షించేందుకు ఎన్ఎస్‌జి కమాండోలు సాయంత్రం ఇంటిని చుట్టుముట్టారు. తెల్లవారు ఝామున ఐదు గంటల సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు బయటపడేందుకు ప్రయత్నించినపుడు ఒక ఉగ్రవాదిని హతమార్చారు. రెండోవాడు వెనక్కు వెళ్లాడు. బందీలను ఉంచిన రూముగాక మరో రూములోకి తప్పుకున్నాడు. దాంతో బందీలందరినీ విడుదల చేశారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఇంటిని కూల్చివేసి రెండవ ఉగ్రవాదిని కూడా మట్టుబెట్టారు.

ఢిల్లీ పోలీసులు 1999 ఆగస్టు 21న ముగ్గురు ఉగ్రవాదులను పట్టుకున్నారు. మరో ఇద్దరు ఉత్తర ప్రదేశ్‌లోని రుద్రపూర్‌లో ఉన్నట్లు వారు వెల్లడించారు. ఢిల్లీపోలీసులు ఎన్ఎస్‌జి సహాయం కోరారు. పదహారు మంది కమాండోలు ఉగ్రవాదులున్న ఇంటిని చుట్టుముట్టారు. ఉదయం 4.45కు చేరుకొని 5.30కు దాడి ప్రారంభించారు. ఉగ్రవాది తన దిండుకింద పెట్టుకున్న తుపాకితో కాల్చాడు. అయితే కమాండోల తుపాకులకు కుప్పకూలిపోయాడు. రెండోవాడు తేరుకొనేలోగానే కమాండోల తుపాకి తూటాలకు గాయపడి 40 నిమిషాల తరువాత మరణించాడు.

2002 సెప్టెంబరు 25న గుజరాత్‌లోని అక్షరధామంపై దాడి చేసి 26 మంది భక్తులను చంపి, అనేక మందిని బందీలుగా పట్టుకున్న ఉగ్రవాదుల ఏరివేతకు ఆపరేషన్ వజ్రశక్తి నిర్వహణ. ఈ కార్యక్రమంలో తొలిసారిగా ఎన్ఎస్‌జి కమాండోలు గాయపడ్డారు. వారిలో ఒకరు పద్దెనిమిది నెలలు కోమాలో ఉండి మరణించారు. 2008 నవంబరు ముంబై ఆపరేషన్ బ్లాక్ టార్నెడో, ఆపరేషన్ సైక్లోన్‌లో మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, హవల్దార్ గజేంద్రసింగ్ అమరులయ్యారు.

చూద్దామా

నయాగరా

ముక్తవరం వసంత కుమారి

అందమైన ఈ నయాగరా జలపాతాన్ని హనీమూన్ కాపిటల్ ఆఫ్ ద వరల్డ్ (విశిష్ట ప్రపంచ శృంగార యాత్ర) అని పిలుస్తారు. ప్రత్యేకంగా నయాగరా జలపాతంలో నవ దంపతులు సరాగాల ద్వారాలు తెరిచి నింగినేల ఏకమైనట్టుండే ప్రకృతి ఒడిలో ఓలలాడి పరవశించి పోతారని చెప్తారు. 19వ శతాబ్ది ప్రారంభంలో (1834) తమ శృంగార యాత్రకు నయాగరా జలపాతాన్ని ఎంచుకున్న తొలిజంట థియోడోసియా, జెరోమ్. అవిధంగా అనాటి నుండి అక్కడ హనీమూన్ జరుపుకోవడం ఒక ఆచారం, సంప్రదాయంగా మొదలైందట. ఇక్కడికి సంవత్సరానికి దాదాపు 50000 మంది నూతన దంపతులు హనీమూన్‌కు వస్తారని అంచనా. కానీ పరవశించే మనసుంటే వయస్సుతో సంబంధం ఏముంది? నింగీ, నేలా, నీరు ఏకమైన చోట పొందే ఆ పారవశ్యం అనంతమైంది. అతీతమైనది.

ప్రకృతి సహజ సిద్ధమైన అతిపెద్ద జలపాతాలలో నయాగరా ఒకటి. అమెరికా వెళ్లినప్పుడు ఈ అద్భుత జలపాతాన్ని చూడటానికి పిల్లలతో కలిసి బయలుదేరాం. కారులో కనెక్టికట్ రాష్ట్రం నుండి ఉదయం 8 గంటలకు బయలుదేరి 6 గంటలపాటు ప్రయాణం చేసి మధ్యాహ్నం 2 గంటలకు అక్కడకు చేరుకున్నాం (మధ్యలో ఆగి బ్రేక్ ఫాస్ట్ చేశామనుకోండి). అక్కడ ఆడమ్స్ మార్క్ హొటల్‌లో బస చేశాం. భోజనం చేసి సాయంత్రం 4 గంటలకు కారులో ఎంతో ఆతృతగా నయగరా జలపాతాన్ని చూడటానికి వెళ్లాం. అది జులై నాల్గవ తేదీ. అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వాతంత్ర్య దినోత్సవం. నయాగరా జలపాతాలకు టపాసులు మరో ఆకర్షణ. రాత్రి 9.30 గంటలు అయితేగానీ టపాకాయలు కాల్చరని చెప్పారు. అంత చీకటిపడేదాకా ఎందుకబ్బా అనుకున్నాం. కానీ జులై నెలలో సూర్యాస్తమయం రాత్రిపూట 9.30 గంటలైతే గానీ జరగదు. వెలుతురు ఉంటుంది. భలే తమాషాగా ఉంది. లైట్లన్నీ తీసేసి టపాకాయలు కాల్చారు. ఆ రంగురంగుల టపాకాయలు ఆకాశంలో వెన్నెలపూల్లా వెలిగాయి. ఆ జలపాతాల హొయలు వింత శోభను సంతరించుకున్నాయి. గంటసేపు నావికా దళం కాల్చిన తర్వాత సప్తవర్ణాల వెలుగులు ఆ ఫాల్స్ మీద ప్రసరించి కృత్రిమ శోభను తెచ్చాయి.

నయాగరా నది కెనడా, అమెరికా సరిహద్దు ప్రాంతంలో ప్రవహిస్తుంది. ప్రశాంతంగా తన ప్రయాణం ప్రారంభించిన ఈ ప్రవాహం ఒక ఎత్తైన ప్రదేశం నుండి జలపాతంలాగా చెవులు బద్దలయ్యేంత హోరుతో కిందికి దూకుతుంది. ఈ అద్భుత దృశ్యం చూడ్డానికి రెండు కళ్లూ చాలవనుకోండి. ఈ ప్రవాహం సుమారు 315 అడుగుల కిందికి వురికి మెల్లగా అంటేరియో సరస్సులో కలుస్తుంది. ఈ క్రమంలో నిమిషానికి 5 లక్షల టన్నుల నీరు జలపాతంగా మారుతుంది.

నయాగరా జలపాతాలను రెండు వైపులనుండి చూడొచ్చు. ఒకటి అమెరికా ఫాల్స్. అమెరికా వైపున్న ఈ ఫాల్స్ బఫెలో నగరానికి 17 మైళ్ల దూరంలో, న్యూయార్క్‌కు 75 మైళ్ల దూరంలో ఉంటాయి. అమెరికా వైపున్న ఇంకొక చిన్న జలపాతాన్ని "బ్రైడల్ వెయిల్ ఫాల్" అంటారు. రెండవ వైపున్న ఇంకొక జలపాతాన్ని హార్స్ షూ ఫాల్స్ అంటారు. ఈ రెండు జలపాతాలను 'గోట్స్ ఐలాండ్స్' విడగొడతాయి. ఈ నయాగరా జలపాతాలను అమెరికా వైపు నుండి చూడాల్సి వస్తుంది. వీటినే కెనడా వైపు వెళ్లి చూస్తే ఎదురుగా చూడగల్గుతాము. కెనడా వైపు అంటేరియో, టోరంటో నగరాల మధ్య నయాగరా జలపాతాలు చూడొచ్చు. నయాగరా సిటీకి (కెనడా) చేరుకోవాలంటే మరో 45

మెయిడ్ ఆఫ్ ద మిస్ట్

స్కైలన్ టవర్





నయాగరా వాటర్ ఫాల్స్

నిమిషాలు కారులో ప్రయాణిస్తేగాని అక్కడికి చేరుకోం. అక్కడికి వెళ్లాలంటే వీసా తీసుకుని వెళ్లాల్సివుంటుంది.

ఈరీ కాలువ అంటేరియో సరస్సు కలిసి నయాగరా నదిగా ప్రవహిస్తుంది. ఈ నది ఫిబ్రవరి నుండి మంచు గడ్డకట్టటం మొదలై మే నెల నుండి మంచు కరగటం మొదలౌతుంది. జూన్ నెల నుండి అక్టోబర్ వరకు సందర్శకుల తాకిడి ఎక్కువౌతుంది. 1800వ సంవత్సరం నుండి సినిమా వాళ్లకు, కళాకారులకు, ప్రయాణీకులకు పర్యాటక కేంద్రంగా, వాణిజ్యపరంగా, పారిశ్రామిక కేంద్రంగా కూడా నయాగరా జలపాతం ప్రఖ్యాతిగాంచింది. అత్యంత అందమైన, శక్తివంతమైన జలవిద్యుచ్ఛక్తి కేంద్రంగా ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచింది.

జులై 5న వీసా తీసుకున్నాం (ఒక గంటలో ఇచ్చారు). పోర్ట్ ఆఫ్ ఎంట్రీ లో చెకింగ్ చేశారు. తర్వాత కెనడా వైపున్న హార్స్ షూ ఫాల్స్ దగ్గరకు వెళ్లటానికి బోటు టికెట్ తీసుకోవాలి. ఒక టనెల్ నుండి వెళ్లి టికెట్ తీసుకుని 'మెయిడ్ ఆఫ్ ద మిస్ట్' బోటులో వెళ్లాం. ఉధృతంగా పడే జలపాతం కిందకు వెళ్లే ప్రయాణాన్ని 'మెయిడ్ ఆఫ్ ద మిస్ట్' అంటారు. ప్రకృతి సహజ సిద్ధమైన ఈ జలపాతం ప్రతినిమిషానికి 4 నుండి 6 మిలియన్ల క్యూబిక్ నీరు జలపాతంగా మారి 188 అడుగుల ఎత్తు నుండి పడుతుంది. బోటులో వెళ్లేటప్పుడు అందరికీ రెయిన్ కోట్లు ఇస్తారు. నీటి ధారలో తడిచి ఆనందడోలికల్లో తేలియాడతాం. ఆ అనుభూతి అలౌకికానందం... ఆ జలపాతాల తుషార తూణీరాలు మీద పడగానే నవనాడులు ఝల్లుమంటాయి. ఆకాశం, నీరు, భూమి ఏకమై నవనాడులతో మమేకమై సంతోషం పట్టలేక గుండె ఒక్కసారిగా ఆగిపోతుందేమోననిపించిన ఆ క్షణం... మరచిపోలేనిది. ఆ అనుభూతిని ఏ కెమేరాలు బంధించజాలవు.. ఆ జలపాతాలపై సూర్య కాంతి పడి వక్రీభవనం చెంది... ఏర్పడిన ఇంద్ర ధనుస్సు అద్భుతంగా వుంటుంది.

తూర్పు అమెరికా, పశ్చిమ కెనడాకు అనుసంధానంగా మూడు ముఖ్యమైన వంతెనలున్నాయి. 1. రెయిన్ బో బ్రిడ్జి. కాలినడకన వెళ్లే ప్రయాణికులు ఈ బ్రిడ్జి మీద నుండి వెళ్తుంటారు. 2. విర్ల్‌పూల్ రాపిడ్స్ బ్రిడ్జి. 3. లెవిస్టన్ క్వీన్ స్టన్ బ్రిడ్జి.

ఇంకొక ప్రత్యేక ఆకర్షణ బ్రైడల్ వెయిల్ ఫాల్. ఈ ఫాల్ అమెరికా (తూర్పు) వైపు ఉంది. ఈ జలపాతాన్ని నవ దంపతులు ఎక్కువగా దర్శిస్తారు. ప్రత్యేకంగా అక్కడ ఆ జలపాతం కిందకు వెళ్లడానికి సహజ సిద్ధమైన టనెల్ ఉందని కనుగొన్నారు. 130 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతుతో టనెల్ ఉందని 1834లో తెలిసింది. కానీ అది చాలా ప్రమాదకరంగా ఉండటంతో అటువంటిదే కొత్త భవనం ఏర్పాటు చేసి అందులో ఎలివేటర్ నిర్మించారు. లిఫ్ట్‌లో వెళితే అక్కడినుండి ఒక రెయిలింగు వుంటుంది. నేరుగా జలపాతాల కిందకు వెళ్లగలుగుతాం. ఆ నీటి తుంపరలతో అద్భుత అనుభవం. ఆ జలపాతం అడుగున వీచేగాలి 68 మైళ్ల వేగంతో వుంటుంది. ఆ గాలిలో నీటి ప్రవాహంతో నిల్చున్నప్పుడు కలిగే ఆనందహేల వర్ణించలేనిది. దీన్నే కేవ్స్ ఆఫ్ ద విండ్ అంటారు. మరొక ఆకర్షణీయ ప్రదేశం స్కైలన్ టవర్. నయాగరా జలపాతం ఎదురుగా వుండే ఈ టవర్‌లో 25 అంతస్తులుంటాయి. ఈ టవర్ మీద నుండి జలపాతం అద్భుతంగా కనిపిస్తుంది. ఇక్కడి ఫ్యామిలీ రెస్టారెంటు ఒక ప్రత్యేక ఆకర్షణ. భోజనం చేస్తూ ఆ సుందర దృశ్యాలు తిలకించటం ఒక అనుభూతి. పరిశోధనా కేంద్రంగా కూడా పనిచేస్తోంది.

టొరంటో నగరం కెనడా ముఖ్య పట్టణం. నయాగరా నగరానికి 60 మైళ్ల దూరంలో ఉంటుంది. అక్కడ కెనడా నేషనల్ టవర్ ప్రధానమైనది. ఫ్లోరల్ క్లాక్, బొటానికల్ పార్క్ ప్రత్యేక ఆకర్షణలు. కెనడా జాతీయ జెండాపై 'మేపుల్ ఆకు' వుంటుంది. కెనడాలో కెనడా డాలరు చెలామణి అవుతుంది. అమెరికన్ డాలర్ కంటే విలువ ఎక్కువే. టొరొంటో నగరం మెట్రోపాలిటన్ సిటీలలో పెద్దది. అక్కడ సేకరించిన మేపుల్ ఆకును మాత్రం మా అనుభూతుల్లాగా భద్రంగా దాచుకున్నాం ఇప్పటికీ. ✠

రెయిన్ బో బ్రిడ్జి



సమ్‌థింగ్ స్పెషల్

కొండకోనలే వారి చిరునామా

వారి గతం ఎంతో ఘనం. ఒకప్పుడు మకుటంలేని మహారాజులు. ఇంటి నిండా నౌకర్లు. చెయ్యిచాచి ఒకరిని అడగడం అంటే గిట్టదు. తాము అన్నం తినేటప్పుడు వేరొకరు చూడకూడదు. వేరొకరు వండిన వంటకాలు తినరు. నివాసం కూడా ఎత్తు మీదనే ఉండాలి. పుట్టుక, పెళ్లి, చావు, జీవనవిధానం అన్నింటిలో భిన్నమైన శైలి. క్రీ.శ 16వ శతాబ్దానికి చెందిన రెడ్డిరాజుల వంశానికి చెందిన వంశస్థులుగా చెప్పుకునే ఖమ్మం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఎత్తైన కొండలపై నివసించే కొండరెడ్ల జీవన విధానం రేఖామాత్రంగా...

- శనగపాటి మురళీకృష్ణ, ఖమ్మం.



ఖమ్మం జిల్లాలోని భద్రాచలం డివిజన్‌లోని చింతూరు, వీఆర్‌పురం, కూనవరం మండలాల్లో కొండరెడ్ల తెగకు చెందిన గిరిజనులున్నారు. వీరిలో ఎక్కువ మంది నాగరికతకు దూరంగా నివసిస్తున్నారు. కొంతమంది నాగరికతకు దగ్గరగా వచ్చినా జీవనవిధానం, అలవాట్లలో ఎటువంటి మార్పూలేదు. వీరిలో మార్పుకోసం ప్రభుత్వం కొండరెడ్ల అభివృద్ధి పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసింది. ప్రత్యేక అధికారిని నియమించి దశాబ్దాలుగా కోట్లు ఖర్చు చేసింది. ఫలితాలు నామమాత్రంగా ఉన్నాయి. చింతూరు కేంద్రంగా సితార అనే స్వచ్ఛంద సంస్థ కూడా కొండరెడ్ల అభివృద్ధికి సంబంధించిన సేవా కార్యక్రమాలు చేస్తోంది. భద్రాచలం డివిజన్‌లో అధికారిక లెక్కల ప్రకారం 2007లో కొండరెడ్ల జనాభా 1014గా ఉంది. ప్రస్తుతం 1100గా ఉంది. వాస్తవంగా వీరి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఎందుకంటే జనన, మరణాల నమోదు అనేది వీరికి తెలియదు.

రక్షణ కోసం వచ్చి...

క్రీ.శ 16వ శతాబ్దానికి చెందిన రెడ్డిరాజులకాలం వంశస్థులుగా ప్రచారంలో ఉన్న కొండరెడ్డి తెగవారు, తమని తాము రక్షించుకోవడానికి వచ్చి స్థిరపడ్డారని చెప్పుకుంటారు. రాజులుగా ఉన్న కాలంలో జరిగిన యుద్ధంలో పరాజయం పొంది... ఎవరికీ దొరకకుండా ఉండేందుకు గోదావరి నది ప్రాంతానికి వచ్చి ఎత్తైన కొండలపై దాక్కొన్నారని పేర్కొంటున్నారు. కాలక్రమేణా అక్కడే స్థిరపడ్డారని అంటుంటారు. ఇన్ని శతాబ్దాలు గడిచి తరాలు మారినా ఆనాటి రాజవంశస్థులనాటి దర్పం వారిలో కన్పించటం అందుకు ఉదాహరణ అంటారు. తాము అందరికంటే గొప్ప అనే భావం వారిని నేటికీ కొండలపై ఉండేట్లు చేస్తోందని కథలుగా చెప్పుకుంటారు. ఇదే విషయాన్ని కొండరెడ్డి తెగకు చెందిన వారితో ప్రస్తావిస్తే వంశపారంపర్యంగా కోయవారి కంటే (మామూలు గిరిజనులు) ఎత్తుపైన నివసిస్తున్నామంటున్నారు.

పురుడు 'కీడు'

పురుడు కార్యక్రమం ప్రస్తుత పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో, కనీసం ఇంట్లో మంత్రసాని ద్వారా జరుగుతోంది. కొండరెడ్డి తెగలో... పురుడు కోసం గర్భిణీగా ఉన్నప్పుడే నివాసాలకు దూరంగా 'కీడుపాక' వేస్తారు. పురిటి నొప్పుల సమయంలో 'స్త్రీ'ని ఆ కీడుపాకలో ఒంటరిగా వదిలేస్తారు. ఒక కత్తిని కూడా అక్కడ వదులుతారు. బిడ్డను కనడం, బొడ్డు కోయడం లాంటివి బాలింతే చేయాలి. మూడు రోజుల పాటు అటువైపు ఎవరూ తిరిగి చూడరు. ప్రసవ సమయంలో ఆమె పెట్టే కేక బయట ఎవరికీ వినపించకూడదు. ఆ కేక విన్నట్లు ఎవరైనా చెపితే వారికి కూడా కీడు సోకినట్లు భావిస్తారు. గ్రామ, కుల బహిష్కరణ అంతకు మించిన శిక్షలకు కూడా గురికావాల్సి ఉంటుంది. మూడు రోజుల తర్వాత కీడుపాక దగ్గరికి మొదట కుటుంబ సభ్యులు వెళ్తారు. అన్ని సవ్యంగా జరిగి తల్లి, బిడ్డ బాగుంటే ఇంటికి తీసుకువస్తారు. లేదంటే అటు నుండి అటే కాటికి పంపుతారు. బారసాలలు, అన్నప్రాసన లాంటివి అసలు జరపరు. ఆడ పిల్లలకు యుక్తవయస్సు వచ్చిన సందర్భంలో కార్యక్రమాలు కూడా ఉండవు.

బహుభార్యత్వం

కొండరెడ్లు ఇళ్లలో పెళ్లి కార్యక్రమం సాదాసీదాగా ఉంటుంది. పెళ్లి చేసుకునే అబ్బాయి తరపువారు ముందుగా కులపెద్దలను ఆశ్రయిస్తారు. వారే అమ్మాయి ఇంటికి వెళ్లి సంబంధం విషయం మాట్లాడతారు. తేదీని కూడా ఖరారు చేస్తారు. మూడు రోజుల పెళ్లి కార్యక్రమంలో మొదటి రోజు పెద్దలు అమ్మాయి ఇంటికి ఉదయం వెళ్తారు. అక్కడి మర్యాదలు, ఇతర కార్యక్రమాలు పూర్తి అయిన మరునాడు అమ్మాయిని, ఆమె బంధువులను రాత్రి భోజనాల సమయానికి అబ్బాయి ఇంటికి తోడ్కొని వస్తారు. మరునాడు ఉదయం అబ్బాయి ఇంటిలో సంధ్యవేళకల్లా పెళ్లి తంతు పూర్తి చేస్తారు. ఆ రాత్రికి అందరూ అబ్బాయింటిలో ఉండి మూడో రోజు ఉదయం భోజనాల అనంతరం నవ దంపతులను అమ్మాయి ఇంటికి తీసుకుని వెళ్తారు. ఈ మూడు రోజులు గ్రామంలో ఏ ఒక్కరూ పనికి వెళ్లరు. అందరూ పెళ్లి తంతులో భాగస్వాములు అవుతారు. ఒక్క గిరిజనుడు ఎంతమందినైనా పెళ్లి చేసుకోవచ్చు. నచ్చిన





స్త్రీతో సహజీవనం చేయవచ్చు. పురుషుడు ఎంతమంది స్త్రీలపై మనసు పడితే అంతమందిని వివాహం చేసుకోవచ్చు. ఒక పురుషుడు వదిలేసిన స్త్రీ జీవిత చరమాంకం వరకు అదే విధంగా ఉండాలి. ఇంకొకరిని పెళ్లి చేసుకోవటం, కలిసి ఉండటం కూడదు. పెళ్లి అనేది ఈ తెగలో పెద్ద తంతుగా జరుగుతుంది. వివిధ ప్రాంతాలలో నివసించే బంధువులందరిని పిలుస్తారు. మద్యం, మాంసంతో విందు చేసుకుంటారు. ఖర్చును పిల్ల తరుపువారు భరించాలి. ఏర్పాట్లు చేయాలి. ఆ మూడు రోజులు ఇళ్లు అలికి, విందులు, నాట్యాలతో కూలాసాగా గడుపుతారు. వధువు తరుపువారు వరుడికి కట్నంగా తాము సాగు చేస్తున్న పోడుభూమిని కట్నంగా ఇస్తారు. లేదంటే కొత్తగా పోడు భూమి నరికైనా ఇవ్వాల్సి ఉంటుంది. వరుడు మనసుపడి చేసుకుంటే కట్నం ఇవ్వరు. పెద్దలు కుదిర్చిన సంబంధాలకే ఇస్తారు.

వ్యవసాయం ... నివాసం

ఒక్కో గిరిజన కుటుంబం తమ నివాస ప్రాంతానికి సమీపంలోని 7 కొండలపై వ్యవసాయం చేస్తుంది. వేసవికాలంలో అడవి తగలబెట్టడం, నరకటం లాంటివి చేస్తారు. దట్టమైన అటవీప్రాంతం. ఎత్తైన కొండల మధ్య నుండి ధారాపాతంగా పడుతున్న నీళ్లు. పక్కనే వీరి నివాసాలు ఉంటాయి. వాటిని 'తోగులు' అని అంటారు. ఒకే ఇంటి పేరున్నవారు ఒకే ప్రాంతంలో ఎక్కువగా నివాసం ఉంటారు. వ్యవసాయం మిశ్రమ పంటలుగా సాగుచేస్తారు. వర్షాధార పంటలే అయినా ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి. నల్లపెసలు, సజ్జలు, పచ్చజొన్న, అలసందలు లాంటివి పండిస్తారు. ఇవి మామూలుగా మైదాన ప్రాంతంలో పండేవాటి కంటే మంచిగా ఉంటాయి. ఎటువంటి ఎరువులూ, పురుగుమందులూ వాడరు. అడవిని కాల్చిన బూడిద, ఆకులు లాంటివి పంట వేసే ముందు భూమిలో వేస్తారు. వీరు తయారు చేసే చాపలు, బుట్టలు లాంటివి కూడా ఎగుమతి అవుతున్నాయి. పక్వానికి వచ్చినా సరే... పండుగ చేసిన తర్వాతే పంట కోస్తారు. మూడు రోజుల పాటు 'పచ్చలు' పేరుతో పండుగ చేస్తారు. మగవాళ్లు అంతా వేటకు వెళ్తారు. చివరి రోజు రాత్రి అందరూ కలిసి వేటలో వచ్చిన మాంసం తిని, ఇప్పసారా సేవించి, పాటలు, నృత్యాలతో గడుపుతారు. మరునాడు పంటల కోత ప్రారంభిస్తారు. ఏడాదిలో వీరికి ఇది పెద్ద పండుగ. చుట్టూ అడవి. అందుబాటులో కలప ఉన్నా మంచాలను ముట్టరు. చాపపైనే నిద్రిస్తారు. కాదు అంటే కర్రలతో మంచెలను నిర్మించుకుంటారు. తప్పితే మంచం అన్నది అక్కడ కన్పించదు.

మిరపకాయ లేకపోతే..

మిరపకాయ లేకపోతే ముద్ద ముట్టరు. ప్రతి వారం సంతకు వెళ్లి ఉప్పు, ఎండుమిర్చి, మిరపకాయలు, ఎండు చేపలు కొనుగోలు చేస్తారు. తాము సేకరించిన అటవీ ఉత్పత్తులు, తయారు చేసిన బుట్టలు అమ్ముకుంటారు. వచ్చిన డబ్బుతో మిరపకాయలు కొనడానికి మొదట ప్రాధాన్యత ఇస్తారు. అన్నంలో మిరపకాయలు నంచుకుని తింటారు. దాచుకోవటం, భవిష్యత్ గురించి ఆలోచన ఉండదు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎవరినీ చెయ్యి చాచి అడగరు.

వారసత్వంగా కుల పెద్దరికం

కులపెద్ద వారసత్వంగా నియామకం అవుతారు. గ్రామంలో ఎవరి మధ్యయినా స్పర్థలు ఏర్పడినా, ఏదైనా కార్యక్రమం (పుట్టుక, పెళ్లి, చావు) చేయాలన్నా ముందుగా కులపెద్దలకు సమాచారం ఇవ్వాలి. ఆయన తీర్పు అందరూ శిరసావహించాలి.

సమిష్టి నిర్ణయాలు

గ్రామం మొత్తానికిగాని, ఏదైనా కుటుంబం, వ్యక్తికి సంబంధించిగానీ, నిర్ణయాలు ఏవైనా సమిష్టిగా తీసుకుంటారు. విషయం కులపెద్దల దృష్టికి తీసుకుపోవాలి. ఆయన గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి తుది నిర్ణయం చేస్తారు. వ్యక్తిగత నిర్ణయాలకు తావుండదు. ఇబ్బందులు ఏమైనా వచ్చినా సమిష్టిగా ఎదుర్కొంటారు.

పోతురాజు దైవం

ఏదైనా మంచి కార్యక్రమం చేసే ముందు కులదైవం అయిన పోతురాజును కొలుస్తారు. ఏడాదిలో ఒకసారి జాతర (పండుగ) జరుపుతారు. సహజంగా వేసవి కాలంలో కులపెద్ద చెప్పిన రోజు పండుగ జరుగుతుంది. ఇది కాక ముత్యాలమ్మ లాంటి జాతరలు కూడా జరుగుతాయి.

కొండజొన్న భోజనం

కొండలపై ఏటవాలు ప్రాంతంలో వర్షాధారంగా పండించే కొండజొన్నలు అన్నం వండుకుని తింటారు. ఇటీవల కాలంలో కొంతమంది వరి పండించటంతో బియ్యం కూడా ఆహారం కోసం వినియోగిస్తున్నారు. అన్నంలో మిరపకాయలు, ఉప్పు, గంజి తప్పకుండా ఉండాలి. ఎండు చేపల కూరకు ప్రీతిపాత్రమైనవి. సంతలో వీటిని ప్రతివారం కొనుగోలు చేస్తారు.

మామూలు వస్త్రధారణ

బట్టలకు అంత ప్రాధాన్యత ఇవ్వరు. కొంతమంది స్త్రీలు నేటికీ జాకెట్ ధరించరు. చీర కొంగుతో కప్పుకొంటారు. పురుషుల్లో కొంతమంది లుంగీలు, చొక్కాలు ధరిస్తున్నారు. పాతతరం వాళ్లు చాలా మంది నేటికీ గోచీలకే పరిమితం అవుతున్నారు. అయినా నేటి యువతరంపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఉంది. లిప్‌స్టిక్, సెంట్లతో పాటు సంతల్లో లభించే మామూలు రకం విలాస వస్తువులు కూడా కొండరెడ్ల వద్ద కన్పిస్తున్నాయి. మొత్తం మీద కొండరెడ్ల జీవనశైలి సమాజంలోని మిగతా వారికంటే భిన్నంగా ఉంటుంది.

✠

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు

వీరి వీరి
గుమ్మడి పండు
వీరి పేరు
కత్రినా కైఫ్



అభ్యుదయ రచయితల విశేషాలు

అభ్యుదయ సాహిత్యోద్యమంలో
తొలితరం కమ్యూనిస్టులు
సంపాదకత్వం: డా॥ ఏటుకూరి ప్రసాద్
వెల : 40/-,పేజీలు : 114,
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435,
విజ్ఞాన్ భవన్, బ్యాంకు స్ట్రీట్, హైదరాబాద్.

తెలుగు సాహిత్య సాంస్కృతిక పునర్వికాసంలో కమ్యూనిస్టుల పాత్ర మరవరానిది. గురజాడ, వీరేశలింగంల వారసత్వాన్ని చాటిచెప్పిందీ, ప్రజా సాహిత్యానికి సమున్నతమైన విలువనిచ్చిందీ వారే. కళనూ కవిత్వాన్ని రాచనగరుల్లోంచి రచ్చపట్టుల్లోకి నడిపించిన ఘనత అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి సంస్థలకే దక్కుతుంది. ఇందుకు సంబంధించిన చరిత్ర విశేషాలను, కొన్ని పత్రాలనూ అందించే పుస్తకం " అభ్యుదయ సాహిత్యంలో తొలితరం కమ్యూనిస్టులు". ఏటుకూరి ప్రసాద్ సంకలనం చేసిన ఈ పుస్తకం అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ అభ్యుదయ రచయితల ఉద్యమం ఏ నేపథ్యంలో పెంపొందిందీ వివరించే వ్యాసంతో మొదలవుతుంది. తర్వాత భారత అభ్యుదయ రచయితల సంఘం లండన్ నుంచి 1936లో విడుదల చేసిన ప్రణాళిక తదనంతర పత్రాలు వున్నాయి. అదే విధంగా ఆంధ్ర రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘ నిర్మాణానికి సన్నాహక సమావేశం 1942లో తెనాలిలో జరిగింది. 1943లో అక్కడే జరిగిన తొలి మహాసభల అధ్యక్షోపన్యాసంలో తాపీ ధర్మారావు ప్రగతిశీల రచయితలకు దిశానిర్దేశం చేశారు. ఆ ప్రసంగం పూర్తి పాఠం, అక్కడ రూపొందిన ప్రణాళిక కూడా పుస్తకంలో పొందుపర్చబడ్డాయి. అయితే సంఘంలో స్తబ్దత,విభేదాలను దాటవేసి 1973లో అరసం కొత్తగా తయారు చేసుకున్న ప్రణాళికను, దాన్ని 2004లో మరింత మార్చుకున్న పాఠాన్ని కూడా ఇచ్చారు. వాస్తవానికి ఇవి 'తొలితరం' అన్న పుస్తకం శీర్షికకు పొసిగేవి కావు. తర్వాతి భాగంలో మద్దుకూరి చంద్రశేఖరరావు, పులుపుల శివయ్య, తుమ్మల వెంకట్రామయ్య, వట్టికోట ఆళ్వారు స్వామి, సెట్టి ఈశ్వరరావు, మగ్దుం మొహియుద్దీన్, సజ్జాద్ జహీర్‌లపై వివిధ రచయితలు రాసిన వ్యాసాలున్నాయి. వీరంతా ప్రముఖులే అయినా తొలితరం అభ్యుదయ రచయితల సంఘంతో ముడిబడిన వారెందరో ప్రస్తావనకు రాలేదనిపిస్తుంది. అన్ని వ్యాసాలూ ఒక ప్రణాళిక ప్రకారం రాయలేదు. ఆ విధంగా చాలా పరిమితులతో కూడిన పుస్తకమిది.

- పీపీ

సామాజిక సాంస్కృతిక దర్శనం



ఆంధ్ర ప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర
ద్యావనపల్లి సత్యనారాయణ
వెల : 90/-,పేజీలు : 171,
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
4-1-435, విజ్ఞాన్ భవన్, బ్యాంకు స్ట్రీట్, హైదరాబాద్.

చరిత్ర అధ్యయనం అత్యంత ఆసక్తికరమైన అనుభవం. వివిధ స్థాయిల్లో విద్యార్థులు ప్రత్యేకించి పోటీ పరీక్షలు రాసే వారికి చరిత్ర చదవడం ఒక అవసరం. ఇటీవలి కాలంలో మారిన పరీక్షల సిలబస్ ప్రకారం ఆంధ్రప్రదేశ్ చరిత్ర సాంఘిక పరిణామాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. దాన్ని అనుసరించి వెలువడుతున్న పుస్తకాలలో ఇది ఒకటి. గ్రూపు 1,2 సిలబస్‌ను అనుసరించి ద్యావనపల్లి సత్యనారాయణ తయారు చేసిన ఈ పుస్తకానికి ప్రముఖ చరిత్ర పరిశోధకుడు, పురాతత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డా.పి.వి.పరబ్రహ్మశాస్త్రి ముందుమాట రాశారు. శాతవాహనులు అంతకు ముందు మౌర్యుల కాలంలో విశేషాలు, రాచరిక యుగంలో ప్రజల స్థితిగతులు పాలనా విధానాలు వగైరా విషయాలు ఇందులో చూడగలుగుతాము. చరిత్రను ప్రజల కోణం నుంచి చూడాలి తప్ప ప్రభువుల దృష్టితో కాదని రచయిత స్పష్టంగా పేర్కొన్నారు. తెలుగు భాషా వికాసం,మత పరమైన అంశాలు కూడా ప్రస్తావించారు. ఆధునిక చరిత్రలో స్వాతంత్ర పోరాటం, తెలంగాణా సాయుధ పోరాటం, రాష్ట్రావతరణం వంటి అధ్యాయాలున్నాయి. 1956 తర్వాత కాలానికి చెందిన కీలకమైన మలుపులు, ఘట్టాలు,ఆర్థికాంశాలు కూడా రేఖామాత్రంగా ఇచ్చారు. ఈ సమాచారం గతంలో ఎనిమిది నెలల పాటు సూర్య దిన పత్రికలో ధారావాహికంగా వచ్చింది. విద్యార్థులకు ఉపయోగకరమైన పుస్తకం.

- ప్రమర

కొత్త పుస్తకాలు



డా॥ మంతెన సూర్యనారాయణ రాజు
కథలు- విమర్శనాత్మక పరిశీలన
నూనె అంకమ్మరావు
ఎం.ఎ, ఎం.ఫిల్.
వెల : 50/-, పేజీలు :100,
ప్రతులకు : శ్రీమతి ఎన్.శ్రీదేవి
ఇం.నెం.7-373(1),
గాంధీ పబ్లిక్ స్కూల్ ఎదురుగా,
మంగమూరు రోడ్డు, ఒంగోలు.
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.

కె.బి. కృష్ణ కథలు
ఒక పరిశీలన
కాకర పర్తి దుర్గా ప్రసాద్
ఎం.ఎ, ఎం.ఫిల్.
వెల : 50/-, పేజీలు : 102,
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.







హోర్డింగ్



హైదరాబాదులో చిత్రకళాభిమానులు, చిత్రకారులు కలిసి ఏర్పాటు చేసిన సంస్థ స్క్రిబుల్. గత కొన్ని సంవత్సరాలుగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సంస్థ వర్ధమాన చిత్రకారుల చిత్ర ప్రదర్శనలను ఏర్పాటు చేసి, వారికి ప్రోత్సాహాన్ని అందిస్తున్నది. తాజాగా ఈ ఏడాది జాతీయ స్థాయిలో చిత్రకళాపోటీని కూడ నిర్వహించి ఒక పెద్ద ముందడుగు వేసింది. దేశం నలుమూలల నుండి 1200కి పైగా ఎంట్రీలు ఈ పోటీకి వచ్చాయి. అలాగే ఆ చిత్రాలలో వైవిధ్యమూ పుష్కలంగా వ్యక్తమయింది. పూనాకు చెందిన ఓ యువ చిత్రకారుడు ఈ పోటీలో ప్రధమ బహుమతి గెలుపొందాడు. ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పలు ప్రోత్సాహక బహుమతులను కూడ అందచేశారు. బహుమతులు పొందిన వాటితో పాటు, పోటీకి వచ్చి ఎంపికలో పరిశీలన జరిపిన అన్ని చిత్రాలను, శిల్పాలను ఇటీవల హైదరాబాదు, స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించారు. వాటిలో కొన్ని ఈ చిత్రాలు.



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూ్కడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్

కలంస్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్.

పేరు: సలీం
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: అక్షర కాన్వెంట్ స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావటం
హాబీలు: కథల పుస్తకాలు చదవటం,
చిరునామా: సలీం,
అక్షర కాన్వెంట్ స్కూల్,
చాపాడు (గ్రామం),
చాపాడు (మం),
జి.టి స్ట్రీట్, ప్రొద్దుటూరు.

పేరు: ఎస్. యాదవ్
చదువు: 9వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.హెచ్.స్కూల్
లక్ష్యం: కానిస్టేబుల్ కావటం
హాబీలు: కబడ్డీ ఆడడం,
చదవటం, క్రికెట్ ఆడటం.
చిరునామా: ఎస్. యాదవ్,
సన్నాఫ్ : లాలు,
తడి హిపర్గ (గ్రామం),
మద్నూర్(మం),
నిజామాబాద్.

పేరు: ఎం. శ్యాంమ్ సన్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: ఏ.బి.ఎమ్ హై స్కూల్
లక్ష్యం: ఇంజనీర్ కావటం
హాబీలు: చదవటం,
పాటలు పాడడం, ఆడటం.
చిరునామా: ఎం. శ్యాంమ్ సన్
పెదమార్పువారి పాలెం,
కర్లపాలెం(మం),
గుంటూరు.

పేరు: జి. మల్లేష్
చదువు: 9వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం: ఐ.పి.ఎస్ కావటం
హాబీలు: క్రికెట్ ఆడటం, చదవటం.
చిరునామా: జి. మల్లేష్
సన్నాఫ్ : రాములు,
పెద్ద ఎడ్గి (గ్రామం),
జుక్కల్ (మం),
నిజామాబాద్.



పేరు: యం. నరసిహ యాదవ్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.హెచ్.ఎస్.
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడం
హాబీలు: పేపర్ చదవటం,
డాన్స్ చేయటం.
చిరునామా: యం. నరసిహ యాదవ్
యాపర్ల (గ్రామం),
పెబ్బేర్ (మం),
మహబూబ్ నగర్.

పేరు: షేక్ అమీర్
చదువు: 10వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
లక్ష్యం: లాయర్,
లేదా పైలేట్ లేదా సిఎ కావటం.
హాబీలు: క్రికెట్ ఆడడం,
పుస్తకాలు చదవటం,
వాలీబాల్ ఆడటం.
చిరునామా: షేక్ అమీర్
సన్నాఫ్ : షేక్ హుస్సేన్,తురకపాలెం (పోస్ట్),
మేడికొండూరు(మం),గుంటూరు.